


క్షణం నిశ్శబ్దం.

"....భూమికీ సూర్యుడికీ మధ్యదూరం ఎంత?"

"తొమ్మిదికోట్ల ముప్పైనాలుగు లక్షల మైళ్ళు."

"మిస్టర్ రమణా-ఆకాశంలో నక్షత్రాలెన్ని?"

లాభంలేదు. ఈ ఉద్యోగం తనకి రాదు. ఆర్థికశాస్త్రంలో పట్టభద్రుడైన తనని ఆస్ట్రానమీలో ప్రశ్నలడుగుతున్నారంటే అందులోనూ ఇలాంటి చొప్పదంటు ప్రశ్నలడుగుతున్నారంటే—ఈ వుద్యోగం యింతకుముందే యెవరికో అంకితం అయిపోయిందన్నమాట.

అయినా చెప్పటం మొదలుపెట్టేడు.

"మన కంటికి కనపడేవి దాదాపు ఆరువేల నక్షత్రాలు. కానీ లక్షమిలియన్ల నక్షత్రాలు మన మిల్కీ-వేలో వున్నాయని అంచనా. అలాంటి మిల్కీ-వే గలాక్సీలు విశ్వంలో దాదాపు పదిలక్షల మిలియన్లున్నాయి. అంటే విశ్వంలో పదికోట్ల, కోట్ల, కోట్ల నక్షత్రాలున్నాయన్నమాట. పది తర్వాత ఇరవైనాలుగు సున్నాలు."

అవతలివాళ్ళ తల దిమ్మెక్కినట్టుంది. కొంచెంసేపెవరూ మాట్లాడలేదు. తరువాత ఒకాయన అడిగేడు.

"లావా అంటే ఏమిటి?"

"భూమి అంతర్భాగాన మహోజ్జ్వలమైన వేడికి కరిగిన ఘనపదార్థం. సప్తలోహాల మిశ్రమం."

"మీరు తెలుగు బాగా అధ్యయనం చేసినట్టున్నారే"....నవ్వులు. రమణ మొహం ఎర్రగా మారింది.

"లావా మరి భూమిపైకి ఎందుకు రాదు?"

"కవచంలాగా పైపొర కప్పుకుంది కాబట్టి."

"లావాలో ఇనుము వుంటుంది కదా."

"ఉంటుంది."

"మీ తమ్ముడు ఓ బావిలోకి అయస్కాంతం పట్టుకెళ్ళాడనుకోండి. మరి లావా బైటకొచ్చెయ్యాలి కదా-ఐ మీన్-భూమిని చీల్చుకొని."

రమణ తలెత్తి చూసేడు. అందరి మొహాల్లోనూ ముసిముసిగా నవ్వులు.

"భూమిపొర చాలా మందం. అలారాదు."

"భూమిపై డెన్సిటీ ఎంత?"

"క్యూబిక్ సెంటీమీటరుకి అయిదు పాయింటు అయిదు గ్రాములు."

"భూమి లోపలి డెన్సిటీ ఎంత?"

"దాదాపు దానికి రెండు రెట్లు."

"అంత డెన్సిటీవున్న లావాని ఈ పొర ఆపగలదా?" అడిగే డొకాయన. "పకోడీలు దట్టంగా కూరి కాగితంలో కడ్తే-లోపలి డెన్సిటీ ఎక్కువైతే ఏమవుతుంది."

ఇంకో ఇంటర్వ్యూ కమిటీమెంబరు తనే సమాధానం చెప్పేడు. "కాగితం పగిలి మనందరికీ పకోడీలు దొరుకుతాయి."

గొల్లున నవ్వులు.

"మిస్టర్ రమణా-భూమి మాస్ ఎంత?"

"అయిదు పాయింట్ తొంభై ఏడు ఇంటూ పదివందల ఇరవై ఏడు గ్రాములు."

"ఇంత పదార్థాన్ని పైపొర ఆపలేకపోతే ఏమవుతుంది?"

రమణ లేచేడు. సర్టిఫికెట్లు సర్దుకొన్నాడు. అన్నాడు. "ఇలాటి ఇంటర్వ్యూలుండవు. మనిషి తిండికోసం ఏడవటం వుండదు. చదువుకున్న చదువుకి ఇంత ఉద్యోగం దొరకలేదే అన్న బాధ వుండదు. ఎయిర్ కండిషన్డ్ రూములుండవు. ప్రశ్నల్నుండవు. సమాధానాలుండవు. అసలేమీ వుండదు."

(ఇంకా వుంది)



# అల్లావుద్దీన్ అభినవ దీపం

దాసుబాబు

## అల్లావుద్దీన్ నగర ప్రవేశం!

అల్లావుద్దీన్ కళ్ళు తెరిచి చూసేసరికి అరవై వోల్టుల బల్బు కనిపించింది!

అద్భుతదీపం ఏమయింది?

రాజూ, రాణీ - వాళ్ళమ్మాయి; మాంత్రికుడూ, దుద్దగానే దీపం పైకొచ్చే రాకాసి మిత్రుడూ—వీళ్ళంతా ఏమైనట్టూ?

ఇంతకూ తనెక్కడున్నట్టు?

ఒళ్ళు దులుపుకుని, బల్బును జేబులో వేసుకుని రోడ్డుమీదకొచ్చాడు. రయ్, రయ్ మని బస్సులు దూసుకెళ్ళాయి. అట్లాగే ఆటోలు, స్కూటర్లు అటూ యిటూ వెళ్ళేసరికి అల్లావుద్దీన్ గూబలు గుయ్‌మన్నాయి.

ఇదెక్కడి ప్రపంచం? ఏ ఒక్కడూ క్షణంసేపాగి ఆలోచించుకోడేం? సార్, మీరు అచ్చు అల్లావుద్దీన్‌గారిలా వున్నారు అని చెప్పరేం? తమరి దీపం అద్భుతాలు వల్లిస్తారా? మీ సాహసగాధలు వినిపిస్తారా—అని అడగరేం?

ఈ చివరున్నవాడికి ఆ చివరేదో కొంప లంటుకున్నట్టు, ఆ చివరున్నవాడికి ఈ చివరేదో కొంపలారిపోయినట్టు ఒకటే ఉరుకులు, పరుగులు! ఎక్కడ చూసినా మనుషులే! అంతా గజిబిజి మనుషులే.

అలనాడు — మనోహరముగా అలరారిన సుందరవనములు మచ్చుకైనను కనిపించుట లేదు. రమణీ ప్రియదూతిక తెచ్చియిచ్చు కప్పురవిడెంబు సేవించి, కనక పంజర శారికలకు ఱక్కెరవెట్టి చదివించు సఖియలు వెంట రాగా, కరతాళగతుల మందిర మయూరంబుల నాడించు యతివలు కథలు చెప్పగా — రాకుమారి ఉద్యానవనంబులో పాదంబిడి ఈ ప్రియుని కొరకు ఎదురుచూడదేలనో? బాల పల్లవ గ్రాసకషాయ కంఠ కలకంఠ వధూకల కాకలీధ్వనులు సేయుచు, "ప్రియతమా, అల్లావుద్దీన్ సఖా" అని రాకుమారి పిలవదేలనో?

ఆ మనోహరత, ఆ ముగ్ధమోహనత్వము, వనములు, మరులుగొల్పు కుసుమ సౌరభములు ఏవి?

నేల ఈనిందా అన్నట్టు ఎక్కడ చూసినా మనుష్యులే .... కుప్పలు కుప్పలుగా! ఇంత మంది వున్నా ఎవడికీ క్షణం తీరికలేదు. ఏమిటో ఈ పరుగులు? ఎక్కడికో వీళ్ళు వెళ్ళేది! కాసేపాగి ఎదుటివాణ్ణి పలకరించేదెప్పుడు?

ఇంతగా వాపోతున్న అల్లావుద్దీన్‌కు తన జేబులో వున్న బల్బు తటాలున గుర్తొచ్చింది. వెంటనే బయటకు తీసి అరచేత్తో రుద్దాడు.

మనువటిలాగా తెరలు తెరలుగా పొగలు, అందులో నుంచి అట్టహాసంచేసే రాకాసి మిత్రుడూ రాలేదు.

ఇంతలో ఎవరో మోకాల్ని గీకుతూ న్నంచే మోర కిందికి దించి చూశాడు. తన మోకాలు ఎత్తున్న మరగుజ్జు పళ్ళికిలిస్తూ కనిపించాడు.

"ఏదెవడ్రా" అని ఆశ్చర్యపోతూ అల్లా వుద్దీన్ మరుగుజ్జుకేసి చూశాడు.

"నమస్తే అల్లావుద్దీన్ సార్! నేనే మీ రాకాసి మిత్రుణ్ని. మర్చిపోయారా?"—మళ్ళీ పళ్ళికిలించాడు.


"నువ్వా, రాకాసి మిత్రుడివా? దున్నపోతంత మనిషివి ఇట్లా ఎలకపిల్లలా తయారయ్యావేం? నమల్మేను" అన్నాడు.

"తమరికి గుర్తున్న ఆ కాయము అద్భుత దీపానికే పరిమితము. అది పోయిందిగా సార్? అరపై వోల్టుల బల్బు రుద్దితే వచ్చేదేముంటుంది? పైగా కరెంటు సప్లయి కూడా సరిగ్గా లేదు" రాకాసి అన్నాడు.

"అయితే మాత్రం .... మరీ మరుగుజ్జు వయిపోతే నాకేం మేలు చేస్తావు చెప్పు?" రెట్టించాడు. దానికి మరుగుజ్జు విరగబడి నవ్వుతూ—

"సార్....నన్ను మరుగుజ్జు అని తీసి పారెయ్యమాకండి. అసలు ఈ ప్రపంచమే మరుగుజ్జుదయిపోయింది సార్! మనుషులు నా కంటే పొడుగ్గా కనిపించినా వాళ్ళ మనసులు మరుగుజ్జు మనసులే సార్! వాళ్ళ మానసికంగా ఎంతగా కుంచించుకపోయారో మీకేం తెలుసు? పైగా నాకేం మేలుచేస్తావు అని అడిగారు. పూర్వం మీకెంతో మేలుచేశాను; మీరు రుద్దినప్పుడల్లా—బాంచెను, కాల్మొక్తా—అని ప్రత్యక్షమై గొంతెమ్మ కోరికలన్నీ తీర్చా. ఏది....దాని ఫలితం ఏమైనా మీకు దక్కిందా? తిండి దగ్గర్నుంచి, కొంప దగ్గర్నుంచి, పెళ్ళాం దగ్గర్నుంచి....ప్రతిదీ సప్లయి సరుకేనా? ఏవి. అవన్నీ ఏమయ్యాయి? దక్కించుకోలేని మేలు దేనికంటా?" కాసేపాగి .... బెంబేలు పడి పోతున్న అల్లావుద్దీన్ మీద జాలిపడి—






"పోన్లెండి....ఇక యిప్పుడు తల పట్టుకుని లాభంలేదు. అప్పటిలాగా భారీఎత్తున దారుణంగా మేలు చెయ్యలేకపోయినా....ఏదో చిల్లరడబ్బుల్లా చేతనయినంతవరకు చేస్తాలేండి. అంతకంటే కూడా మరో గొప్ప మేలు చేసే అవకాశం వుంది."

చేతులు వెనక కట్టుకుని ముఖం కాస్త పక్కకు తిప్పుకుని మరుగుజ్జూ ఓ పోజు పెట్టాడు. అప్పుడు ఊపిరి ఆడింది అల్లా వుద్దీన్‌కు.

"అదేదో వెంటనే చెప్పరాదూ....ఈ పోజు దేనికి?"

కాస్త కోపంగా అన్నాడు.

మరుగుజ్జు నవ్వి—

"అంతే సార్. ఇక్కడ ఎవరు ఎవరికి రవ్వంత మేలు చేసినా ముందు పోజులు పెడతారు. ఆ పోజుల్లోనే తమ 'పరపతి' పెంచుకుంటారు. పోజులేని పనే లేదనుకోండి! హి హి!!" అన్నాడు.

"ఊఁ చాల్లే, పోజు! ఇంతకూ నువ్వు చేసే మేలేమిటి చెప్పు—"

కసిరాడు అల్లావుద్దీన్.

"అదే సార్. సలహాలివ్వడం. మీరేవడిగినా సలహా సహాయం చేస్తా."

ఆసక్తిగా చెప్పాడు.

"సలహా సహాయమా? సలహాలతో నా కడుపు నిండుతుందా? నా పనులవుతాయా?"

గద్దించాడు.

"కడుపు నిండాలనీ లేదు; పనులు కావాలనీ లేదు. సలహా సహాయమంటే సలహాయే! దానికే ఇప్పుడిక్కడ మాంచి గిరాకీ వుంది సార్. ప్రతివాడూ పెద్దవాడి దగ్గర్నుంచి.... చిన్నవాడి వరకు, సలహాలు చెప్పేవాళ్ళే కాని పనులు చేసేవాళ్ళు కారు సార్! దీనికి ఏ పెట్టుబడీ లేదా....ప్రతివాడూ సలహాదార్ అయి పోయాడనుకోండి. ఇంతెందుకు కోట్లు కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టులన్నీ ఈ సలహాలతోనే నడుస్తున్నాయనుకోండి."

అల్లావుద్దీన్ మధ్యలోనే అందుకున్నాడు.

"అంతే నీ ఉద్దేశం....పనులు కావటం లేదనా?"

"అంతే కదా. మన సలహా ప్రకారం పనులు జరగడానికి వీల్లేదు. ఈ సలహాను పేపరువాళ్ళకిస్తే ....వాళ్ళు దాన్ని భద్రంగా లోకానికిస్తారు. లోకులు అతి జాగ్రత్తగా ఆ స[illegible]హాను పంచుకుంటారు."

అల్లావుద్దీన్‌కు నిజంగా కోపం వచ్చింది.

"ఆపు. నీ సలహాలతో నాకు నిమిత్తం లేదు. కడుపు మండిపోతుంది. ఏ లోకంలో తిన్నానో యేమో తింటానికేదైనా తెచ్చిపెట్టు."

శాసించాడు.

"ఈ శాసనాలే పనికిరావు: ప్రజాస్వామ్యంలో ఇవి చెల్లవు. ఎదురుగా పంపు కనిపిస్తుందా? చిన్న సలహా. అక్కడికెళ్ళి కడుపు మంటలార్చుకుందాం పదండి."

అల్లావుద్దీన్ జవాబుకోసం యెదురుచూడకుండానే గునగునమంటూ పంపు దగ్గరకు పరుగెత్తాడు మరుగుజ్జు. వాడెటు పారిపోతాడోనని అల్లావుద్దీన్‌కూడా పరుగెత్తేడు వాడివెంట. అక్కడకు వెళ్ళాక—

"ఊఁ....చెప్పండి సార్....ముందు మీరు తాగుతారా, నన్ను తాగమంటారా?"

మరుగుజ్జు అడిగాడు. దాంతో అల్లావుద్దీన్ చిర్రెత్తిపోయి వాణ్ని పక్కకు తోసి, పంపు తిప్పాడు. కీచుమనే శబ్దాలు తప్పితే చుక్కరాల్లేదు. కొద్దిసేపలాగే శబ్దాలు విని—

"ఏమిటి నీళ్ళే రావడంలేదు?" అల్లావుద్దీన్ అడిగాడు.

"అంతేసార్! నీళ్ళొస్తే పంపులెందుకు? వచ్చే నీళ్ళను ఆపుచెయ్యడానికే పంపులు."

"అంటే అసలు నీళ్ళే రావా?"


"వస్తాయి. అంతా నిద్రపోయ్యాక ఏ మధ్యరాత్రికాడో బందిపోటు దొంగల్లా వస్తాయి! ఇందులో యింకొక సమస్యకూడా వుంది. పట్టపగలు ఇంత వెలుగులో వచ్చాయనుకోండి....అందులోవున్న బురదా, బొద్దింకలూ, తేళ్ళూ, పాములూ కనిపిస్తాయిగా? అందుకని......."

అల్లావుద్దీన్ హతాశుడయ్యాడు.

మరుగుజ్జుకు మళ్ళీ జాలివేసింది.

"చిన్న సలహా. మిమ్మల్నీ, మీ అద్భుత గాథల్నీ పుస్తకాల్లో యిరికించి కథల రూపంగా స్కూళ్ళలో బోధిస్తున్నారు. బడికి అమాంతంగా తీసుకెళ్తా. అక్కడేమన్నా మేలు జరుగుతుందేమో చూద్దాం." అంటూనే మరుగుజ్జు అల్లావుద్దీన్‌తో సహా మాయమయ్యాడు.

(ఇంకా వుంది)




సీరియల్




"ఊర్రపడికి ఏదో సుస్తీ అన్నావు ఏం సుస్తీ!" అని అడిగింది మీరా దారిలో.

"నీరసం—కొడుకులు రమ్మన్నా వెళ్ళరు. పెద్దవాళ్ళకి ఇదో పిచ్చి. సొంత వూరూ, ఇల్లూ అంటూ కదల్రు" కాస్త కోపంగా అంది జానకి. వాళ్ళమ్మా నాన్నాకూడా ఇలాగే అన్నారు

ఉచితం!! FREE!!!

# విధేయత

మహారాణి ఎలిజబెత్ గూర్చి చక్కని కథ ఉంది. ఆ రాజకుమారి తొమ్మిది సంవత్సరాల బాలికగా ఉన్నప్పుడు తన నాయనమ్మతో కలిసి ఏవో వస్తువులు కొనుటకు లండన్ నగరంలో ఒక అంగడికి వెళ్ళిందట. రాకుమారి అంగడిలోనికి వెళ్ళటం చూచిన ప్రజలు తిరిగి ఆమెను చూడటానికి అంగడి ముందు గుంపులుగా వేచియున్నారట. ఇది గ్రహించిన రాజకుమారి వాళ్ళ నాయనమ్మతో "తొందరగా కానియ్యి నాయనమ్మా! వెలుపల ఇంగ్లండుదేశపు రాజకుమారిని చూచుటకు ఎంతోమంది ప్రజలు వేచియున్నారు," అని విసుగ్గా అందట. ఎలిజబెత్ మాటలు విన్న నాన్నమ్మ విస్తుపోయింది. 'ఈ పిల్లకు ఈ వయస్సులోనే కాబోయే మహారాణినని దర్పం ఏర్పడేలాగుంది' అని మనసులో అనుకొని మామూలు మార్గములో కాకుండా మరొక మర్గములో రాజకుమారిని బయటకు తీసుకొని వెళ్ళింది. తరువాత ఆమె ఎలిజబెత్‌తో ఇలా అంది "ఈనాడు ప్రజలు నీ తల్లి దండ్రులను అనురాగముతో చూస్తున్నారంటే దానికి కారణం వారు అధికారం చెలాయిస్తూ రాజ్యమేలుతున్నారని కాదు. వారు ఈ ప్రజలకు అణుకువతో సేవ చేస్తున్నారు. ముత్యాలు, రత్నాలతో చెక్కబడిన కిరీటము ఒకనాటికి నీ శిరస్సును అలంకరిస్తుంది. అయితే అణకువ, నమ్రత, వినయము నీ శిరస్సుకు సాటిలేని సౌందర్యాన్ని చేకూర్చిపెడతాయి తల్లీ!" అని.

క్రీస్తుప్రభు రాజులకు రాజు. ప్రభువులకు ప్రభువు. అయినను ఆయన ఆకారమందు మనుష్యునిగా కనపడి శిలువమరణము పొందు నంతగా వినయము చూపినవాడై తన్నుతాను తగ్గించుకొనెను. అందుచేత ప్రతివాని నాలుక తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లు దేవుడు ఆయనను అధికముగా హెచ్చించెను. ఆ ప్రభువుగూర్చి తెలుసుకున్నారా!.

చదలవాడ చంద్రమతీదేవి


| ఉచితం !! | ఉచితం !!! |
| --- | --- |
| దైవస్వరూపుడైన యేసుక్రీస్తు జీవితచరిత్ర, ఆయన బోధలు తెలిపే అందమైన 300 పేజీల పుస్తకం ఉచితంగా కావాలనుకుంటే మీ చిరునామా ఈ రోజే తెల్పండి. పోస్టు ఖర్చులు మేమే భరించి మీకు ఉచితంగా పంపుతాము. | ఇదీ అడ్రస్: డా॥ ఎస్. జాన్ డేవిడ్, ఫార్ కార్నర్స్ పోస్టుబాక్సు 315, విజయవాడ-2. FAR CORNERS |

Gospel Message Inserted by Far Corners






# అల్లావుద్దీన్ అభినవ దీపం

దాసుబాబు

## 2

### రాజకీయ మాయాజాలం

అల్లావుద్దీన్ ఆత్రంగా బల్బును రుద్దాడు. మరుగుజ్జు ప్రత్యక్షమయ్యాడు.

"రాకాసి మి త్ర మా!....'అదేవో సమ్మె జరుగుతుంది, స్కూళ్ళు మూసేశారు' అని నన్ని చింతచెట్టుకింద వదిలేసి వెళ్ళావ.... తర్వాత యేం జరిగిందో తెలుసా రాకాసి మిత్రమా?...."

"ఆపు. నీ పిలుపు బాగోలేదు, రాకాసి.... అని పిలవొద్దు. ముద్దుగా మజ్జు అని పిలు. మరుగుజ్జు అనే నా నామధేయాని కివి పొడి అక్షరాలు!"—కాలర్ యెగరవేస్తూ అన్నాడు మజ్జు.

"పోనే—అట్లాగే పిలుస్తా. రాత్రి ఓ లారీడు మనుష్యులు నా దగ్గర కొచ్చారు...."

"పోలీసులేమో. నీ వేషం చూసి పట్టుకెళ్దామని వచ్చుంటారు. అంతా ఒకే రకమైన గుడ్డ లేసుకున్నారా?" మజ్జు ప్రశ్నించాడు.

"ఆఁ, అంతా ఒకే రకం. తలమీద తెల్ల టోపి....లాల్చీ, పైజామా, పంచెలూ—అన్నీ తెలుపే."

"ఓషోష్. వాళ్ళా....ఖద్దరు శాల్తీలు! అహాఁ నీదాకా వచ్చారూ....వీళ్ళ దుంపతెగ, వచ్చేది అయిదేండ్ల కొక్కమారే అయినా—పుట్టలో వున్న పామునైనా సరే బయటకు లాగి ఓటు వేయించుకుంటారు...."

"అదేవిఁటి....పుట్టలో పాము కాటేస్తుంది. ....ఓటేమిటి?" అల్లావుద్దీన్ అడిగాడు.

"అదే ,రాజకీయం అంటే! కాటేసేవాడికి కోటిసే వాడు ఓటిస్తాడు!! ఓటు వేయించుకోవడం ముఖ్యం. కాళ్ళూ గడ్డాలూ యేవీ అడ్డు రావు—"

"మళ్ళీ యీ కాళ్ళూ....గడ్డాలూ ఏవిఁటి?"

"అదే ఓటరు గడ్డం ఒకడు పట్టుకుని "బాబ్బాబంటే".... ఇంకొకడు కాళ్ళు బట్టుకుని "అయ్యయ్యా" అంటాడు! ఎక్కడలేని భక్తి, ఆత్మీయత వొలకబోస్తారు...."

"మజ్జూ రాత్రి అంతపని జరిగించిస్మీ! ఆకలవుతుందంటే మిరపకాయ బజ్జీలేవో పెట్టి నువ్వెళ్ళిపోయావా? కారమనిపించినా ఆకలి బాధకు తట్టుకోలేక వాటిని తినేసి నీళ్ళు.... తాగుదామని పంపుకెదురుగా కూర్చున్నా.అప్పటికింకా పంపుల్లో గుఁయ్‌మన్న మోత తగ్గలేదు. ఇంతలో లారీ వచ్చింది. అందులోనుంచి బిల బిల మంటూ తెల్లటోపీవాళ్ళు దిగొచ్చారు. మజ్జూ—వాళ్ళంతా టోపీ లెందుకు పెట్టు

కున్నారు?" అమాయకంగా అడిగాడు.

"తరవాత మనలాంటివాళ్ళ నెత్తిన పెట్టడానికి!" ఠపీమని జవాబు చెప్పాడు మజ్జు.

"మరి నాకు పెట్టలేదేం?"

"పెట్టేవుంటారు? అమ్మా........ఊరకనే పోతారా వాళ్ళు? నీతో యేం చెప్పారో చెప్పు. నే చెప్తా."

"చాలా చెప్పారు. అన్నీ గుర్తుంటాయా? ముందు—మీ యిల్లెక్కడ—అని అడిగారు. నాకు యిల్లు లేదు; ప్రస్తుతానికి చింతచెట్టుకింద వుంటున్నా అన్నా. అప్పు దేమన్నారో తెలుసా?...."

"ఏవన్నారేం?"

"నీ కొక యింటిస్థలం మంజూరు చేస్తున్నాం. రేపో ఎల్లుండో వచ్చి యింటి స్థలానికి పట్టా పట్టుకెళ్ళు అన్నారు."

"అన్నారా? మరేం, టోపీ పెట్టలేదంటావేం! అహ్హహ్హహ్హ...." నడుంమీద చేతులు పెట్టుకుని, మోర పైకెత్తి కాసేపు కడుపు నిండా నవ్వి—

"ఆహా....నీ ఓటుకు పట్టా .... మనిషికో పట్టా... ననవా....టటటా చిచిచీ...ననవా...." అంటూ మజ్జు చిందేస్తుంటే అల్లావుద్దీన్‌కు మతిపోయినంతపనయింది. తమ తేరుకుని....

"ఇదేంటి మజ్జు....యీ చిందేవిఁటి?...." అన్నాడు.

"నీకో యిల్లూ, దానికో పట్టా వస్తున్నందుకు....నా చిందు....ననవా....టటటా—"

"అవు నీ చిందు....కొండముచ్చులాగా. అసలు పట్టా రాందే...." దాంతో మజ్జు మనిషిలాగా నిలబడి—

"అట్టా అన్నావా బావుంది. రాజకీయం చెప్తా విను. నీకు పట్టా రాదు. వాళ్ళక్కావల సిందల్లా నీ ఓటు! దానికోసం ఓటి మాటలు కోటి చెప్తారు. మనిషికో పట్టా అంటారు.... కావాలంటే మనిషికో ఎకరం అంటారు."

"మరి వాళ్ళిచ్చిన మాట సంగతేమిటి?"

"నువ్వు ఓటిచ్చేవరకే ఆ మాట....నమ్మ నా మాట—" మజ్జు అన్నాడు.

"మరి దీని మాటేమిటి?" ఓ పది రూపాయల నోటు చూపిస్తూ—

"మాజీ మంత్రిగారిని కలుసుకోమని, ఈ కాగితంమీద వారి చిరునామా, ఈ నోటు ఇచ్చి వెళ్ళారు టోపీల వాళ్ళు—" మజ్జు యెగిరి అల్లావుద్దీన్ చేతిలో రెపరెప మంటున్న పది రూపాయల నోటును లాక్కొని—

"మాజీ మంత్రిగారింటికి తర్వాత.... ముందు హోటల్లో మజా—పద—" అంటూ గునగున పరుగెడుతూ హోటల్లో దూరాడు.

అల్లావుద్దీన్ మజ్జు వెనకాలే పరుగెత్తాడు.

పదిరూపాయల మందందాకా టిఫిన్లు తిని, రిక్షా యెక్కి మాజీ మంత్రిగారింటికొచ్చారు.

అక్కడ—మాజీమంత్రిగారు తను కొత్తగా ఎం. పీ.గా నిలబడిన సందర్భంలో ఓ బ్రహ్మాండమైన టీపార్టీని ఏర్పాటు చేశాడు.

అటూ ఇటూగా ఉన్న పార్టీ నాయకుల్నీ, రెండో ఆటకి కూడా టికెట్టు దొరకని నాయకుల్నీ, అలిగిన వాళ్ళనీ, నలిగినవాళ్ళనీ టీ పార్టీ పేరుమీద తనింటికి పిలిపించుకున్నాడు—

మునుపు యెప్పుడూ లేని రాజకీయ జూదం జరుగుతుంది కాబట్టి, యెవరెటు పిలిస్తే అటు వెళ్ళేవాళ్ళంతా అక్కడ పోగయ్యారు. అంతా అల్లావుద్దీన్ కోసం యెదురుచూస్తున్నారని మజ్జు పసిగట్టి—

"అల్లావుద్దీన్....నువ్వేం కంగారుపడకుండా వాళ్ళదగ్గరకు వెళ్ళు. వాళ్ళు యేం చెప్పినా సరే నను. నీకు అనుమాన మేస్తే బల్బును మూడుసార్లు నొక్కు. వెంటనే నీ పక్కకొచ్చేస్తా. అయితే ఒహటి. నేను నీకు మాత్రమే కనిపిస్తా; నా మాటలు నీకే వినిపిస్తాయి—కాస్త జాగ్రత్తగా మెసులుకో....రాజకీయ నాయకులంటే నీ దీపాన్ని కాజేసిన మాంత్రికుని బంధువర్గమే—వస్తున్నారుచూడు—హాంఫట్—" అల్లావుద్దీన్ ఏవీఁ చెప్పకముందే మజ్జు మాయమయ్యాడు!

"అల్లావుద్దీన్‌కీ—జై! మాయా దీపానికే మన ఓట్లు!!"

పదిమంది జై కొట్టుకుంటూ రానే వచ్చారు.






అమాంతంగా అల్లావుద్దీన్ని చేతులమీద ఎత్తుకొని సోఫాలో మాజీమంత్రిగారి పక్కలో కూర్చోబెట్టారు.

చుట్టూ కుచేలుడి సంతానం చాలా వుంది. బిక్కు బిక్కుమంటూ కూర్చున్నాడు అల్లావుద్దీన్.

మంత్రిగారు టోపీ సరిచేసుకుని ఉపన్యాసం మొదలుపెట్టారు.

"ఎలక్షన్లో మనం గెలుస్తామా, ఓడిపోతామా అన్నది ముఖ్యం కాదు! మన డిపాజిట్టు దక్కుతుందా లేదా అన్నది ముఖ్యం కాదు! మన పార్టీని ఎలాంటి మహామహులు బలపరుస్తున్నారు అన్నది ముఖ్యమని ఈ వేదికమీంచి మనవి చేస్తున్నా—"

టప టపామని అంతా చప్పట్లు కొట్టారు. యెందుకా చప్పట్లో అల్లావుద్దీన్‌కు అర్థం కాలేదు!

"మహా పరాక్రమవంతుడు.......మాయా దీపం సంపాదకుడు—శ్రీ అల్లావుద్దీన్‌గారు మనల్ని బలపరుస్తున్నారని తెలియజేయడానికి గర్విస్తున్నా—" అనేసరికి మళ్ళీ ఫెళఫెళమన్నాయి చప్పట్లు.

అంతా యికిలిస్తూ తనవేపే చూస్తూంటే తట్టుకోలేక, నెమ్మదిగా జేబులోకి చెయ్యి

పోనిచ్చి బల్బును మూడుసార్లు నొక్కాడు. వెంటనే మజ్జు ప్రత్యక్షమై, అల్లావుద్దీన్ కాళ్ళ దగ్గర కూర్చుని,

"అప్పుడే యేం ముంచుకొచ్చిందని బల్బు నొక్కావ్, వీళ్ళ డ్రామా చూడకుండా....?" అని అల్లావుద్దీన్‌కి తొడపాసం పెట్టాడు.

దాంతో—"బాబోయ్ డ్రామా—" అని అల్లావుద్దీన్ గట్టిగా అరిచాడు.

మాజీ మంత్రిగారి కది వినిపించింది. అల్లావుద్దీన్ వైపు చూస్తూ—

"ఏమిటి మీరు డ్రామా అన్నారా? ఆహా. ....ఇది అంతయు మాయాదీపముయొక్క మహిమ కదా! కాలేజిలో నేనున్నప్పుడు—అంటే అప్పుడు గుమస్తాగా కుదిరా లెండి—ఒక వార్షికోత్సవానికి అల్లావుద్దీన్ వేషం కట్టా లెండి—డ్రామాలో! ఆ రహస్యం మీ కిట్టే తెలిసిపోయింది....హిహి....అంతా మాయా దీపముయొక్క మహిమ....హిహి...." అల్లావుద్దీన్‌కు తేళ్ళూ, జెర్రులూ పాకినట్టనిపించింది—ఆ మాటలు వింటూంటే.

పొతపళ్ళూ, దొప్ప చెవులు, నత్తిముక్కు, బల్లి కళ్ళు, బానకడుపు—ఇతడా నా పాత్ర ధరించింది? అని అల్లావుద్దీన్ మాజీమంత్రిగారిని ఎగాదిగా చూస్తూ వుంటే—

"అల్లావుద్దీన్‌గారు నా వైపు అంత యిదిగా చూస్తున్నారంటే నేను వారి అభిమానాన్ని చూరగొన్నట్టే!" మంత్రిగా రన్నారు.

మజ్జు—అల్లావుద్దీన్ని మరోసారి గిచ్చి—

"జాగ్రత్తగా విను. నీకు టోపీ పడబోతోంది" అన్నాడు.

అల్లావుద్దీన్ చెవులు నిక్కించాడు. మంత్రిగారు టోపి సరిచేసుకుని—

"ఈ శుభసమయాన, మన పార్టీ కార్యకర్తల సమక్షంలో—చాలా జాగ్రత్తగా ఆలోచించి—ఒక ముఖ్యమైన ప్రకటన చేస్తున్నా. పేపరువాళ్ళు—అంటే పాత్రికేయులు—నేను చెప్పింది చెప్పినట్టుగా పేపర్లో వెయ్యాలని మనవి. మా పార్టీ అధికారంలోకి వస్తే శ్రీశ్రీ అల్లావుద్దీన్‌గారిని ప్ర ధా న మాంత్రికుడిగా చేస్తాం!—" అన్నాడు.

"బాబోయ్ మాంత్రికుడు—" అని అదిరిపడి, కాళ్ళదగ్గరున్న మజ్జును ఒక్క తన్నాడు అల్లావుద్దీన్. ఆ మాట మంత్రిగారికి వినిపించింది.

"ఛ. ఛ. అచ్చు తప్పు. మాంత్రికుడు కాదు—మంత్రి—హెహ్హె మంత్రి—సారీ.... మంత్రి! మంత్రిగా చేస్తాం—" సవరించుకుంటూ మాజీమంత్రిగా రన్నారు.

"మంత్రీ—మాంత్రికుడు రెండూ ఒకే లాగా వినిపిస్తున్నాయేంటి మజ్జూ?" నెమ్మదిగా అన్నాడు అల్లావుద్దీన్.

"అంతే, అంతే. రెండూ ఒకటే! ఇద్దరు చేసే పనులూ ఒకటే—మంత్రాలు! ఈ రెండు మాటలు ఒకటే-నువ్వు సరిగ్గానే విన్నావ్‌లే-" మజ్జు చెప్పాడు.

"అనుమానంలేదు. శ్రీ అల్లావుద్దీన్‌గారిని ప్రధానమంత్రిని చేసి తీరుతాం" మంత్రిగారు ఆవేశంగా, సోఫాని గుద్ది చెప్పేసరికి—అక్కడ పోగైన వాళ్ళంతా—

"ప్రధానమంత్రి అల్లావుద్దీన్‌కీ—జై—" అంటూ నోరు నొచ్చేవరకు నినాదాలు చేశారు. వాళ్ళు అలా జైకొడుతూ వుంటే—అల్లావుద్దీన్ మజ్జుతో మాట్లాడాడు.

"మజ్జూ....చూశావా వీళ్ళ అభిమానం! పాపం....ఇంతగా వీళ్ళు బతిమలాడుతుంటే యెలా వద్దనాలి? పోనీ, ఈ ఒక్కసారికి ప్రధానమంత్రిగా నిలబడేనా?"కాస్త వినయంగా, సిగ్గుపడుతూ అల్లావుద్దీన్ అంటూ వుంటే—

"అబ్బ—పడింది నాయనా టోపి! నీకు పడింది మామూలు టోపి కాదు—శిల్కు ఖద్దరు. ఆ శిల్కు ఖద్దరు యెవరు కొంటారో గాని మీటరు యాభై రూపాయలకి తక్కువ వుండదు. అదుగో ఆ టోపి పడింది నీకు! మంత్రి వవుతావా? మాంత్రికుడి వవుతావా?" అంటూ మరోసారి తొడపాసెం....పెట్టాడు మజ్జు.

"వద్దు బాబోయ్" అని చిన్నపాటిగా గావు కేక పెట్టాడు!

ఆ మాటలు అందరికీ వినిపించాయి. మంత్రిగారు నోరు చేసుకున్నారు.

"ఏవిటండీ....ప్రధాన మంత్రిపదవి అక్కర్లేదా? భయమా? అనుభవం లేదని శంకా? నేమన్నాగా? మీ పక్కనే వుంటా. నేను చెప్పిన మాట వినండి—నెగ్గుకొస్తారు. ప్రధానమంత్రి అనిపించితే చాలుగా—పార్లమెంటుకి వచ్చినా రాకపోయినా ఫర్వాలేదు. ఆ రాత నొసటమీద వుండాలేగాని....ఎక్కడన్నా చదువుకోవచ్చు.... పార్లమెంటులోనే చదవాలనేం లేదు. పోతే మిత్రులారా....పార్టీ కార్యకర్తల్లారా, మరో ముఖ్యమైన విషయం. మన పార్టీ ప్ర ధా న సమస్య ప్రధానమంత్రి—అది కాస్తా తేలిపోయింది! ఇక పోతే—నిధుల సేకరణ. నిజం చెప్పాలంటే అది కూడా తేలిపోయిందని చెప్పడానికి సంతోషిస్తు...."

"అల్లావుద్దీన్—" మజ్జు నెమ్మదిగా పిలిచి, "ఇంకో బాణంవేస్తున్నాడు కాస్కో"అన్నాడు.

"ఊరికే పెద్దవాళ్ళని అనుమానించమాక" అని మజ్జుని మందలించాడు అల్లావుద్దీన్. మంత్రిగారు అందుకున్నారు—ఆ మాటలు విన్నాక.

"ఛి. ఛీ, నేను, తమరిని అనుమానించడమా?" ముక్కుమీద వేలు వేసుకుని—

"కలలో కూడా ఊహించమాకండి. ఆప్తుల్లాగా మీరు మాకు దొరికారు. మిమ్మల్ని అనుమానిస్తే....ఇక మాకు మిగిలిందేమిటి చెప్పండి?" గొంతును వొణికించి, దాన్ని మళ్ళీ సరిచేసుకుని—

"పార్టీ నిధులకోసం ఎవర్నీ యాచించే పనే లేదు అని మనవి చేస్తున్నాను. మన ప్రధాన మంత్రి అల్లావుద్దీన్‌గారి దగ్గరున్న మాయా దీపమే మన నిధి! అదే మన పెన్నిధి!! మాయా దీపానికి—" మాజీ మ ం త్రి గా రు ఉక్కిరి బిక్కిరి అవుతూ అంటూ వుంటే.... యేమని అరవాలో తెలియక కొంతమంది "జై"—అనీ, కొంతమంది "మీ ఓటు"—అని కేకలు వేశారు. ఆ కేకల మధ్యలో అల్లావుద్దీన్ మజ్జును పిలిచి—

"మజ్జూ! వీళ్ళకు నిధులు కావాలంట.... యేదీ కాసులు కురిపించు—" అన్నాడు.

"కాసులు రాసుల్లా కురిపించాలి కదూ! హూ నాయనే! రాత్రి నీకు మిరపకాయ బజ్జీలు కొని పెట్టడానికి నాకు గతిలేదు....కనీసం మంచి నీళ్లు తాగడానికి నీకు గతిలేదు! కాసులు రాసులుగా కురిపిస్తే దేశానికి ఈ తిప్పలెందుకు బాబూ?" మజ్జు దీర్ఘం తీశాడు.

"ఊ(. నేను ప్రధాన మంత్రిని కాగానే నీకు బజ్జీలు,వడలు కాఫీలు....యెన్నికావాలంటే."

"ఆగండి అల్లావుద్దీన్ జీ! బజ్జీలోకి మిరపకాయలూ వడల్లోకి ఉల్లిగడ్డలూ, కాఫీలోకి పంచదార యిప్పించండి....పుణ్యం వుంటుంది, కాసులూ వొద్దు....రాసులూ వొద్దు." మజ్జు ప్రాధేయపడ్డాడు.

"మరీ యింత చిన్న కోరికలా ప్రధాన మంత్రిని అడిగేది! ఏ అర్ధ రా జ్య మో, మణులో, మాణిక్యాలో...."

"అదే అదే. ప్రజాస్వామ్యంలో ఈ దేశం మొత్తం మనదే! ఎటొచ్చీ ఆరడుగులు సొంత భూమి అంటూ లేదు—చస్తే అందులో ఇరకడానికి! మీ మణులూ మాణిక్యాలు వొద్దుగాని—మార్కెట్టులోవున్న సరుకులు మాయం గాకుండా చెయ్యండి బాబూ—" మజ్జూ దీనంగా ముఖం పెట్టాడు.

"ఇదో మజ్జూ....నువ్వు మరీ మనిషిలాగా మాట్లాడేస్తున్నావ్. పైగా....నువ్వు....నా భవిష్యత్తుకు అడ్డొస్తున్నావు. అది గమనించు—"

"ఆహా. ఇ ద ం డి రాజకీయమంటే! చూశావా....ఈ దేశంలో రాజకీయాలు యెంత తేలిగ్గా వంటబడతాయో! చూడు అల్లావుద్దీన్-ప్రతి నాయకుడూ మాయాదీపంకోసం తన్నుకలాడేవాడే. అన్నీ మాయ మాటలే. నీ దగ్గరున్న అ అద్భుత దీపాన్ని కాజెయ్యాలని నీకు పట్టం కట్టారు. అది కాస్తా చేజిక్కిందనుకో.... నిన్ను చింతచెట్టుకింద కూడా వుండనివ్వరు! పైగా—నీ దగ్గరగా వుంది అరవై వోల్టుల బల్బు అనగానే నాలుగు అంటించి దాన్ని ఫ్యూజు చేసి గిరాటేస్తారు. నా మాట విను.... వీళ్ళంతా నీకు జెయ్‌కొట్టే మైకంలో వుండగానే ఇక్కణ్నుంచి పారిపోదాం పద. తర్వాత సంగతి తర్వాత ఆలోచిద్దాం. "మజ్జూకి జై".... అని బల్బుని నొక్కు.అమాంతంగా మాయమై చింత చెట్టుకిందకొస్తావ్. అక్కడ కలుసుకుంటా, టాటా....బైబై...." అని మజ్జూ మాయమయ్యాడు!

అంత పనీ చేసి అమాంతంగా అల్లావుద్దీన్ కూడా మాయమైపోయాడు. (ఇంకావుంది)



# అల్లావుద్దీన్ అభినవ దీపం

## వాస్‌బాబు



### అల్లావుద్దీన్ జ్వరం

అల్లావుద్దీన్ అదేపనిగా బల్బును రుద్దుతూ వుంటే మజ్జు ప్రత్యక్షమై—

"ఏం ముంచుకొచ్చిందని అలా తోమేస్తున్నావ్?" అడిగాడు. అందుకు అల్లావుద్దీన్ బుంగమూతిపెట్టి—

"మజ్జూ, రాత్రి నాకు జ్వరం తగిలింది. చాలా నీరసంగా వుంది. నాలుకంతా చేదయిపోయింది. ఏదన్నా ఆస్పత్రికి తీసుకెళ్ళి మందిప్పించు." అన్నాడు అల్లావుద్దీన్.

"జ్వరాలు, జబ్బులు తగలడానికి వీల్లేదయ్యా. ఇక్కడి ఆస్పత్రుల సంగతి నీకు తెలియదు," విసుక్కుంటూ అన్నాడు.

"అదేంటి మజ్జూ. అంత పెద్ద పెద్ద బిల్డింగులు కట్టారు కదా ఆస్పత్రులని....నాకు మందు దొరకదంటావేం?"

"అసలు సంగతి నీకు సరిగా తెలియదు కాబోలు: చూడు—ఇక్కడి బిల్డింగులు వేరు అందులో పనిజేసేవాళ్ళు వేరు. మనుషులకొచ్చే రోగాలు వేరు, వాళ్ళకిచ్చే మందులు వేరు. ఇందులోవున్న తిరకాసు నీ కర్థంకావాలంటే నీకు బోలెడంత చదువు చెప్పాలి: బిల్డింగుల భ్రమలో పడమాక." పోజుపెట్టి మజ్జూ ఉపన్యాసం దంచేస్తుంటే అల్లావుద్దీన్‌కి కోపం వచ్చింది.

"మజ్జూ. నాకు రోగమొచ్చి నే నేడుస్తుంటే నీ ఉపన్యాసమేంటి? నన్ను ఆస్పత్రిలోకి అర్జంటుగా తీసుకెళ్ళు—" ఆజ్ఞాపించాడు.

"అర్జంటుగా వచ్చే వాళ్ళందర్నీ ఎమర్జెన్సీ కేసులు అంటారు. పద. నీ కేసు అలాంటిదేమో చూద్దాం!"

అల్లావుద్దీన్‌కి ఆ మాటలు వెంటనే అర్థం కాలేదు. మజ్జూ వెనకాలే నడుస్తూ ఆస్పత్రిలో అడుగుపెట్టాడు. ఎదురుగా "విచారణ" బోర్డు కనిపిస్తే అక్కడకు వెళ్ళారు.

"ఇదేవిటి మజ్జూ....విచారణ అని వుందేవిటి? ఇక్కడికొచ్చిన వాళ్ళంతా విచారిస్తూ కూర్చోవాలా?" అల్లావుద్దీన్ అడిగాడు.

"అప్పే అదికాదు; కొంత విచారం, మిగిలింది, విషాదం! ఆస్పత్రి అంటే రోగ నిలయం అని అర్థం. రోగ నిలయంలో విచారం కాక, ఉల్లాసముంటుందా సారూ! పద....ఆ విచారం దగ్గరకెళ్దాం" మజ్జూ దారి తీశాడు. అల్లావుద్దీన్ అతని వెనకాలే వెళ్ళాడు.

విచార బోనులో కునుకేస్తున్న గుమస్తా దగ్గరకెళ్ళి-సార్-సార్-గురో-అని మజ్జుకేకలు వేస్తే, అతను లేచి-చేతులు పైకెత్తి మూతి ముందుకుపెట్టి ఆవులించి, ఏం కావాలి? అన్నట్టు కనుబొమ ఎగరవేశాడు.

"చూడు సార్. ఈయన మహావీర అల్లావుద్దీన్. జ్వరం తగిలింది. ఇక్కడ జ్వరం వార్డు ఎక్కడ? మందువార్డు యెక్కడ? యెటు వెళ్ళమంటారు మమ్మల్ని?" మజ్జు చాలా వినయంగా అడిగాడు. గుమస్తా ఇద్దర్నీ యెగాదిగా చూసి-ఒక్క పొడిదగ్గు దగ్గి—

"నేరుగా వెళ్ళి యెడమకు తిరిగి ముందుకెళ్ళి, కుడిపైపుకు తిరిగితే ఇవతలపక్క కనిపించేదే జ్వరం వార్డు. ప్రతి వార్డులో డాక్టర్లకు కుర్చీలు, బల్లలూ వుంటాయికాని—అసలు డాక్టరు వార్డు క్యాంటీన్‌కు వెనుక, హాస్టల్‌కు ముందూ వుంటుంది. మందు వార్డు "సి" బ్లాకులో రెండో రోలో వుంటుంది. అయితే మీరు వెళ్ళవలసింది తిన్నగ గేటు బయటకు" అన్నాడు గుక్క తిప్పుకుంటూ.

"అదేంటిసార్, ఇంత చెప్పి గేటు బయటకంటారు?" మజ్జు కంగారుగా అడిగాడు.

"ఎటు వెళ్ళాలి అని అడిగావు కదయ్యా. ఇదేదారి. గేటుదారి." అన్నాడు మళ్ళీఆవులిస్తూ.

"మరి మా మందు మాటేమిటి?" అల్లావుద్దీన్ అమాయకంగా అడిగాడు.

"పైకెళ్ళి దేవున్నడుగు. ఇక్కడ మందులూ లెవ్వు, డాక్టర్లూ లేరు. సమ్మె. అంతా సమ్మె చేస్తున్నారు. మీకు గేటే గతి-పొండి. పది నిమిషాలు నిద్ర పోనివ్వరుగా" విసుక్కున్నాడు.

మజ్జూ నిక్కుతూ-

"సార్, చిన్న సందేహం, ఏమీ లేదు. మందూలేదు మాకూ లేదు అంటున్నారు.... మరి మీరిలా నిద్రపోవడానికి స్లీపింగ్ పిల్స్

యెవరిచ్చారు సార్-" అని గునగునామంటూ గేటుకేసి పరిగెత్తాడు. కాసేపు విత్తపోయినట్టు చూసి అల్లావుద్దీన్ కూడ దౌడు లంకించు కున్నాడు గేటుకేసి.

గేట్లు బయట మజ్జూను కలుసుకొని

"ఏంటి మజ్జూ అందరితో గిల్లికజ్జాలు పెట్టు కుంటావు? నీ వెనకాతల పురకలేక చస్తున్నా" రొప్పుతూ అన్నాడు అల్లావుద్దీన్.

"ఉరికి చచ్చినా పర్వాలేదుగాని రోగంతో చావమాక. ఈ దేశంలో మందులూ లెవ్వు డాక్టర్లూ లేరు."

"మరెట్లా మజ్జూ జబ్బు పోయేది?"

"అదే చెప్పేది. అసలు రోగాలు రాడానికి వీల్లేదు. అదంతే. సమ్మె అని చెప్పలే. మూడు నెల్లు యే డాక్టరూ మందూ లేకుండా బతకలే? రోగాలు పేషంట్లతో యెంచక్కా కో అపరేటు చేశాయని! డాక్టర్ల సమ్మె అని తెలియగానే రోగాలు అలా సరుకుపోలే? నీ కసలు తెలి యదు కాని అల్లావుద్దీన్ డాక్టర్లు ఓపికచేస ఒక్క సంవత్సరంపాటు సమ్మె చేస్తే చాలా రోగాలు రాకుండానే పోతాయి." అని కిలకిలా నవ్వాడు అల్లావుద్దీన్ ముఖం చిట్లించి.

"ఏవిటి మజ్జూ ఆ నవ్వు వికారంగా-సంగతేవిటో చెప్పకుండా చేతులెగరేస్తే సరి పోయిందా?" అడిగాడు.

"అదే-మనకు రోగాలు రాకపోతే వైద్యం సిబ్బందికి, బతుకులేక రోగంతో-" మళ్ళి నవ్వాడు.

"ఆపు నీ నవ్వు. నా జ్వరానికి అర్జంటుగా మందు కావాలి. మాయాబలంతో మందు రప్పించు" ఆజ్ఞాపించాడు అల్లావుద్దీన్.

"చెప్పాగా-మాయచేసి మందు తెచ్చేదాని కన్నా నీ రోగాన్నే నయం చేస్తే పోలే. మాయలు పారడంలేదు. వుండు-అదృష్టం! సైకిలొస్తోంది!" మజ్జు కళ్ళు తళుక్కు మన్నాయి.

"సైకిలా? అదృష్టమా? దాన్ని మింగితే జ్వరం పోతుందా!" ఆశ్చర్యంలోనుంచి తేరు కునే లోగా సైకిల్ రానే వచ్చింది. మజ్జూ దాన్ని ఆపు చేశాడు. సైకిల్ వెనకాల కేరియర్ మీద కాస్త పొడుగ్గా సొరకాయలావున్న ముతక సంచి ఒకటుంది. సైకిలు సీటుమీద ఏమి చెయ్యడానికయినా సిద్ధంగా వున్నట్టున్న శాల్తీ ఒకటుంది. దీనికడ్డంగా మజ్జూ వెళ్ళి-"సైకిలా పంపి భిషగ్వరా! అల్లావుద్దీన్ నామధేయు డితడు. నాటుమందుగ్గాని లొంగని రోగాని కితడు తగిలాడు. సువర్ణలేహ్య చింతామణీ చిట్కాలో, గులేబకావళి గుళికలో ప్రసాదించి రుగ్మతను రూపు మాపుడు!" వినయం వుట్టి పడుతూ పలికాడు. అబ్బ! మజ్జూకి యెన్ని మాటలు తెలుసో-అనుకున్నాడు అల్లావుద్దీన్.

ఇంతలో వైద్యశిఖామణి తేరుకుని, సైకిలుమీదనుంచి దిగి ఫ్రెంచికట్ మీసాల్ని దగరకు వత్తుకుని, సైకిలు కట్టు పంచెను రెండంగుళాలు వదులుచేసి, గొంతుకు సవ రించుకుని, "అబ్బాయి మరుగుజ్జూ అల్లా వుద్దీనా నీ పేరు?" అని అడిగాడు.

పకపక మంటూ అసలు అల్లావుద్దీన్ నవ్వుతూ వుంటే - పాపం మజ్జు ముఖం గుళి కంతయింది.

"పేర్లో యేముందిలే. ఏదీ చెయ్యటివ్వు-" అని మజ్జూ చెయ్యని లాక్కుని, చేతివేళ్ళను పటిక్ పటిక్‌మని విరిచి, మణికట్టు దగ్గర నాడి పట్టుకుని, కళ్ళు మూసుకుని మోర పైకెత్తాడు. అల్లావుద్దీన్‌కి నవ్వెక్కువైంది, మజ్జూకి కోపం ఎక్కువయింది. తనని మరుగుజ్జూ అన్నం దుకు మరీ మండిపడుతూ ఏమీ మాట్లాడ కుండా చెయ్యిచ్చి - చిటపటమంటూ అలాగే వున్నాడు. అదంతా జ్వర తీవ్రత అను కొన్నాడు పాపం వైద్యశ్రేష్ఠుడు. క్షణం గడి చాక—

"చూడు మరుగుజ్జబ్బాయి. నాడి కప్ప లాగా దూకుతోంది. కాని కంగారుపడమాక. నారసింహ లేహ్యం అని ఒకటుంది...." మజ్జూకి ఒళ్ళుమండి. మధ్యలోనే అందుకుని-

"హిరణ్యకశిప ద్రావకం యేవీ లేదా?" అని అడిగాడు.

వైద్యశిఖామణి తెల్లబోయాడు. మజ్జూ చెయ్యి లాక్కున్నాడు.

"హిరణ్యకశిప ద్రావకమా? ఆ పేరు యెక్కడా ఆయుర్వేదంలో వినపడలేదే?"

"ఓహో. దీనిక్కూడా వేదాన్ని జోడిం చారా? మరణవేదంలో వుంటుందేమో వెదికి చూడలేకపోయారా!" మజ్జూ అడిగాడు.

"ఆగబ్బాయి. గట్టి పిండంలా వున్నావు. గైడుచూసి చెప్తా" అని సొరకాయ సంచిలోంచి తలగడంత పుస్తకాన్ని బయటకులాగి—

"నేనేది చేసినా గైడు ప్రకారమే చేస్తాను. ఏం, ఇంతలా వుందేమని తెల్లబోతున్నావా! ఇదేవిటనుకున్నావ్...."

"చిత్రగుప్తుడి డైరీలా వుంది. నీ నంబ రొచ్చిందా యేం?" ఆ నాటువైద్యుడి తలమీద నాటు బాంబులా పడ్డాయా మాటలు. దాంతో ఆయన ముఖం లేహ్యంలా మారింది.

"వచ్చే వుంటుంది. లేకపోతే నాతో చెయ్యి కలపవు! చూడు రోగమొచ్చింది మా అల్లా వుద్దీన్‌జీకి, నాక్కాదు. ఆ గైడేదో మేమే కొనుక్కుంటాం. అన్నిటికీ సర్వరోగ నివా రిణి రాంబాణం ఏ బీ సీ డీల తెల్లబిళ్ళలేవో వున్నాయిగా. అవే మింగెదము. మీరిక దయ చేయుడు. చిత్రగుప్తుడు పిలుస్తున్నాడు—" అంటూ ముందుకు వంగి చటుక్కున సైకిల్ పైరుకున్న వాల్‌ట్యూబ్‌ను ఊడబెరికి గున గునమంటూ పరిగెత్తాడు. అటూ ఇటూ చూసి అల్లావుద్దీన్ మజ్జూ వెనకాలే లగెత్తాడు.

చాలా దూరం వెళ్ళాక మజ్జు ఆగాడు. అల్లావుద్దీన్ కూడా అక్కడికి చేరుకున్నాడు. అయిదు నిమిషాలు కొలిమి తిత్తుల్లాగా రొప్పిం తర్వాత—

"మజ్జూ—వైద్యుడి సైకిలు చక్రం గాలెం దుకు తీశావ్?" అల్లావుద్దీన్ ప్రశ్నించాడు.

లేకపోతే వాడు మనగాలి తీసేవాడు. ఒక జ్వరం స్పెషలిస్టువున్నాడు .... అక్క డికి?"

"వద్దు బాబోయ్ నాకు డాక్టర్లూ వద్దు— మందులూ వద్దు. అటు ఇటు పరుగెత్తలేక చస్తున్నా. మజ్జూ - ప్రమాణంచేసి చెప్పుతున్నా. ఈ దేశంలో వున్నంతకాలం ఇక జ్వరం తెచ్చు కోను. నిజం. నీ మీద ఒట్టు!" అని మజ్జూను ముట్టుకోగానే ఆంఫంట్ మని మజ్జు మాయ మయ్యాడు.


బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!

స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి

లోధ్ర

75 సంవత్సరములకు పైగా సుఖజీవనమునకు లోధ్ర టానిక్‌ను వాడిన స్త్రీలు ఎందరో!


ఉచిత వైద్య సలహాకు
ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.

పేరు: ______
విలాసము: ______
______ PIN ______




కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14

ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికిందరాబాద్.



# అల్లావుద్దీన్ అభినవ దీపం

దాస్ బాబు

## అల్లావుద్దీన్ రై (జై) లు ప్రయాణం

అల్లావుద్దీన్ ఆవులించి, కళ్ళు నలుపుకుని అటూ యిటూ చూసేసరికి మజ్జు ఎక్కడా కనిపించలేదు. అరవైవోల్టుల బల్బును రుద్దే సరికి—ఓ మూలనుంచి గునగున పరుగెత్తుకుంటూ వచ్చి — గుడ్ మార్నింగ్ సార్— అన్నాడు. రాకాసి మిత్రం ఉరఫ్ మజ్జు ప్రవర్శించిన వినయం అల్లావుద్దీన్‌కు నచ్చింది. అంతేకాదు—పూర్వం రోజులుకూడా గుర్తొచ్చాయి. అప్పటి ఠీవిని వెలగబెడుతూ—

"చూడు రాకాసి మిత్రమా....ఉన్నపళంగా మనం వింత పావుకోళ్ళ మీద చెన్నపట్నం వెళ్ళాలి. ఏదీ....ఆంఫట్ అని ఓ అద్భుతం చెయి —"అన్నాడు....ఆజ్ఞాపూర్వకంగా.

మరుగుజ్జుగా మారిన రాకాసిమిత్రం ముఖమంతా చించుకుని—"టాట్. నేను రాకాసిలాగా కనిపిస్తున్నానా? మజ్జూ అని పిలవమని చెప్పలేదూ? పావుకోళ్ళు లేవు, అరకోళ్ళూ లెవ్వు. అరవై వోల్టుల బల్బుకి అద్భుతాలు జరగవు — ఇక మీ యిష్టం సార్—" అన్నాడు.

"అటులయినచో ధూమశకటయానము తప్పనిసరియా....ప్రథమ తరగతి యందు మన మిద్దరము ప్రయాణమునకు సిద్ధమగుదుము గాక—"

"సార్. ఈ లోకంలోకి రండి సార్. లోకులకర్థమయ్యే భాష మాట్లాడండి సార్. చెప్పుబుక్కు తర్జుమాలా వుంది తమరి భాష. రైలుబండి అంటేనే అర్థమవుతుంది. ఇక ఫస్టు క్లాసు ప్రయాణమంటారా — పైసలు యిల్లియా. చివరి తరగతే గతి—"

"అంటే మూడో తరగతా?"

"నో. ఇప్పుడు మూడో తరగతి లేదు సార్. ఒకప్పుడు, తమరు గోలీలు ఆడుకునే దశలో యింటర్ క్లాసు అని ఒకటుండేది. అంటే మొత్తం రైలుబండిలో నాలుగు తరగతులుండేవన్నమాట—ప్రైమరీ స్కూల్లాగా" మజ్జు చెప్పాడు.

"మరిప్పుడు అవన్నీ ఏమయ్యాయి?" అల్లావుద్దీన్ అడిగాడు.


"సగం పొయ్యాయి...సగం మిగిలాయి."

"అంటే .... ప్రయాణం చేసేవాళ్ళు తగ్గిపొయ్యారా?"

"లేదు. ఎక్కువయ్యారు. కాని—టికెట్ కొనటం లేదు. వీళ్ళదంతా ఎఫ్.ఎస్. క్లాసు. అంటే ఫ్రీ సర్వీస్."








"మజ్జూ, మనం కూడా ఎఫెస్సు క్లాసులో మదరాసు పోదామా?" ముచ్చటపడ్డాడు.

"పోదాం పోదాం....ఏ ప్రాజెక్టుకో రాళ్ళు కొట్టడానికి! సార్ .... టికెట్ లేకుండా ప్రయాణంచేస్తే టీసీ పట్టుకుంటాడు. వెంటనే మనల్ని ప్రాజెక్టుకి బట్వాడా చేస్తాడు. లాభం లేదు."

"ఎట్లాగన్నా సరే — మదరాసుకు చేర్చు మజ్జూ!"

"ఎట్లాగంటే....ఎవడిజేబన్నా కొట్టాలి."

"కొట్టు మరి...."

"ఆహా....నీకేం....బల్బు చేతిలో వుంది కదా అని నోరు నొవ్వకుండా చెప్పుతావు. జేబుకొడితే నా వీపు పగలగొడతారు — అదీ లాభం లేదు." చేతులు కట్టుకుని మోర పైకెత్తాడు. అల్లావుద్దీన్‌కి అసహనం పెరిగిపోయింది.

"ఆదేమన్నా సరే. అర్జంటుగా మదరాసు చేర్చు. ఇది నా ఆజ్ఞ" బల్బు నొక్కాడు.

"సరే సార్. రెండు సెకెండ్ క్లాస్ టికెట్లు కొనుక్కొని వస్తాను వుండండి" అంటూ మజ్జు పరుగెత్తాడు.

మజ్జు టికెట్లు కొనుక్కొని రావడం, ఇద్దరూ కలిసి రైలుస్టేషన్‌కు వెళ్ళడం అంతా అర్ధగంటలో జరిగిపోయింది. అక్కడ మరో అర్ధగంట గడిచిపోయింది.


"మదరాసు వెళ్ళే ఎక్స్‌ప్రెస్ మరో అయిదు నిమిషాల్లో ఒకటో నంబరు ప్లాట్‌ఫారం మీదకు వస్తుంది—" రైల్వే మైకులన్నీ వంతుల వారీగా మోగాయి. దాంతో అల్లావుద్దీన్ ముఖం విప్పారింది.

"మజ్జూ! అయిదు నిమిషాల్లో మనబండొస్తుందట!"

"అయితే మరేం పర్వాలేదుగాని—మనం నాస్తా చేసొద్దాం సార్—" మజ్జు క్యాంటీన్ వైపు మళ్ళాడు.

"అదేంటి మజ్జూ అయిదు నిమిషాల్లో బండొస్తుందంటే?"

"సరేలే వచ్చినప్పటి మాట కదా! ఇక్కడి టైమింగ్స్ నీకు తెలియవు కాబోలు. అయిదు నిమిషాలంటే అరగంట, ఇదుగో వచ్చేబండి అంటే పావుగంట; కొద్దిక్షణాల్లో అంటే అయిదు నిమిషాలు.





నా సౌందర్యం. అంటే ఆయనకు ఎంతో ప్రీతి!
ఆ విషయం ఆయన చెప్పనవసరం లేదు — ఆయన కళ్ళ
లోకి చూస్తేనే చాలు! ఆలా కలిగే ఆనందానికి హద్దులేదు.
ఆ ఆనందం వలన ఇంటి పనులలో నాకు — కష్టమేకల గదు.
నిజం చెప్పాలంటే నాకు వివాహమయి పది
"సంవత్సరాలు పూర్తయిందంటే నమ్మలేరు గదా...కాదా?
ఆ రహస్యం—ఆయనకు, నా సౌందర్యానికి సహాయం
చేస్తోన్న పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్‌కి మాత్రమే తెలుసు.

పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్
మీరు కూడా సౌందర్యంతో శోభించండి.

**Pond's**

PJL. 1840 R




"ఒకటో నంబరు ప్లాటుఫారం మీదకు బండి వచ్చియున్నది —" అన్న ప్రకటనే నిఖరమైన ప్రకటన. కనక కాస్త కాఫీ అన్నా తాగొద్దాం రండి సార్....ఈ రైళ్ళ మోతలకి తల దిమ్మెత్తిపోయింది." మజ్జూ క్యాంటీన్‌కి దారి తీశాడు. అల్లావుద్దీన్ అతని వెనకాలే వెళ్ళాడు.

క్యాంటీన్ చుట్టూ ముసురుకున్నారు పాసెంజర్లు. కాళ్ళసందుల్లోనుంచీ దూరి, బుడుంగున పైకి లేచి రెండు కాఫీ కప్పులు అందుకుని, అల్లావుద్దీన్ ముందు తేలి, అతని చేతికి ఓ కాఫీకప్పు అందించాడు. అల్లావుద్దీన్ నోట్లో పెట్టుకున్నాడో లేదో — థూత్ — అని వూస్తూ—

"ఇది కాఫా? [illegible] తుంది—థూత్" అన్నాడు.

"అంటే.... [illegible] కూడలి కదా యిది....కాఫీలో [illegible] కలిపితే అంటువ్యాధులు రావు [illegible].." చాలా తాపీగా [illegible]

"ఏడ్చినట్టే వుంది నీ సమర్థింపు. [illegible] ఈసారి టీ పట్రా—"

కాఫీ పారబోస్తూ, హుకుం జారీ చేశాడు. మజ్జూ బుడుంగుమని, టీ కప్పుతో తేలి అల్లావుద్దీన్‌కి అందించాడు. అనుమానంగా, భయంగా టీని రుచి చూశాడు. మళ్ళీ "థూత్" అన్నాడు.

"ఇది టీయా దగ్గుమందా?"

"దగ్గుమందే. ఇక్కడ టొగ్గు పులుసు యెక్కువగా పీల్చేస్తారీ పాసెంజర్లూ....వాళ్ళ ఆరోగ్యం కోసమని దగ్గుమందు...."

"అయితే యిది రైల్వే స్టేషన్ కాదు—ఆస్పత్రి. ఇక్కడ కొచ్చేవాళ్ళు పాసెంజర్లు కాదు పేషెంట్లు...." అల్లావుద్దీన్ ఆవేశంగా అన్నాడు.

ఇంతలో మళ్ళీ మైకులు మోగాయి—

"మదరాసు వెళ్ళే బండి ఒకటో నంబరు ప్లాట్‌ఫారంమీదకు వచ్చియున్నది."

ఆ మాట విన్నాడో లేదో మజ్జూ గునగున [illegible] పరుగెత్తాడు. టీ కప్పును [illegible] పారేసి అతని వెనకాలే పరుగెత్తాడు- [illegible]

[illegible] దగ్గర [illegible] దిగివాళ్ళు, [illegible] దగ్గర

త్వరలో ప్రారంభం!

ప్రఖ్యాత రచయిత్రి బీనాదేవి సీరియల్

# భూమి గుండ్రంగా వుంది

జ్యోతిలో ధారావాహికంగా ప్రచురించబడుతూ, అనివార్య కారణాల వల్ల ఆగిపోయిన బీనాదేవి సీరియల్ నవల త్వరలోనే జ్యోతిలో మళ్ళీ ప్రారంభించబోతున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము.

—ఎడిటర్.

ఢీకొన్నారు. తోపిడి అయితే వుంది కాని యెవరూ ఒక్క అంగుళం కదలడం లేదు. అది గమనించి మజ్జా కాళ్ళ సందుల్లో నుంచి దూరి వెళ్ళి ఒక సీటుమీద కూర్చుని కాలర్ యెగరేశాడు. అయిదు నిమిషాల్లో అంతా సర్దుకున్నాక అల్లావుద్దీన్ వచ్చాడు. వస్తూనే చినిగిపోయిన జేబు చూపించాడు. మజ్జా గట్టిగా నవ్వుతూ—

"రాంగ్ చాయిస్‌! యెవడో ఆశపడి నీ జేబును తడిమాడు! పర్వాలేదులే .... సర్దుకో. ప్రయాణంలో యివన్నీ మామూలే. రా, కూర్చో సార్, కష్టపడి సంపాదించాను కిటికీ పక్క సీటుని—" తను లేచి అల్లావుద్దీన్ని కూర్చోబెట్టాడు.

ఇంతలో బెకబెకమంటూ ఒక ఫామిలీ వచ్చింది. ఎనిమిది మంది వుంటారు. రెండు రేకుపెట్టెలు, డోలంత మూట, తాటాకులు బుట్టలు, కొబ్బరి బోండాలు, చద్దిమూటలు, కొబ్బరి చీపురుకట్టలు - మోసుకుని ఫుల్ లోడుమీద వచ్చారు. వస్తూనే గబగబా సగం సామాన్ని పైన సర్దారు—మిగతా సామాన్ని కింద కుక్కారు..ఎదుటివాళ్ళ కాళ్ళు విరుగుతాయన్న సోయి లేకుండా. డోలు మూటను నడవలో పారేసి అది మాది కాదు అన్నట్టు కూర్చోడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఆ మూట - అటునుంచి, యిటునుంచి వచ్చే జన ప్రవాహానికి ఆనకట్టలా వుంది. అయినా హనుమంతుడిలా దానిమీదనుంచి దూకి వెళ్ళే వాళ్ళు వెళ్తూనే వున్నారు. ఆ ఫామిలీ యిన్‌చార్జి, సామాన్ని తప్పించుకుంటూ రెండు అంగలు వేసి అల్లావుద్దీన్ ముందుకొచ్చాడు. మజ్జు పక్కనే నిల్చొనివుంటే ఆతనికేసి ఒకసారి చూసి కిసుక్కుమని నవ్వి—


"మీరు యివతలకు జరగండి మా ఫామిలి కూర్చుంటది—" అన్నాడు అల్లావుద్దీన్‌తో. వెంటనే మజ్జా కలిపించుకుని—

"ఎవతల జరగాలి..అవతల స్థలం వుందా?" దీర్ఘం తీశాడు.

"మధ్యలో నీ కెందుకయ్యా, నే నేదో పెద్ద మనిషిని బతిమాలుకుంటే — జరగండి సార్ ఆడంగులు కూర్చుంటారు .... ఆడవాళ్ళని నిలబెట్టి మనం కూర్చుంటామా— రావే చిట్టీ— కూర్చో—" అన్నాడు.

అల్లావుద్దీన్ జరిగినా జరగకపోయినా ఆమె పూనికచేస్తూంటే అల్లావుద్దీన్ చటాలున లేచి నిలువబడ్డాడు. చిట్టిగారొచ్చి పైట సర్దుకుని






కూర్చున్నారు. మిగతా వాళ్ళంతా అంగుళం, అరంగుళం ఖాళీ యెక్కడ వుంటే అక్కడ కూర్చున్నారు.

తీరా బండి కదలక ముందు—ఇంజను కూత విని మరో పాతిక మంది బిలబిలామని తోసుకొచ్చారు. ప్లాటుఫారం దాటే వరకు యెక్కుతూనే వున్నారు. రెండు నిమిషాలు గడిచాయో లేదో ఓ సాయిబుగారు ఫామిలీ దగ్గర కొచ్చారు. వస్తూనే—

"ఏంది క్లాసట్లో కూకండావ్ .... వుటో మెమ్ సాయిబ్" అన్నాడు కోపంగా. ఆవిడ బిక్కమొకంవేసి ఇన్‌చార్జి కేసి చూసింది. అతను కల్పించుకున్నాడు.

"ఏం దబాయిస్తున్నావ్ — నీ సీటని రాసుందా? యిప్పుడొచ్చి మాట్లాడుతున్నావేందయ్యా?" మధ్యలో రెండు సార్లు ఫామిలీని చూసుకుంటూ గట్టిగానే అన్నాడు.

"ఏమ్ భాయ్ దేక్కె బాత్ కరో. రుమాలు పెట్టి ఛాయ్‌కి కిందికి పోయా. సజ్జా—పైనుం దొస్తున్నా. ముందు లే!" సాయిబుగారికి ఓపిక తగ్గిపోతోంది.

"ఈ రుమాల్ తమరిదేనా సాబ్? గాలికి యెగిరిపోతుందేమోనని చేత్తో పట్టుకున్నా. ఈ సీట్లోనే వుంది—" పావు కిలో మురికి పేరుకున్న రుమాలు తీసి ఆ సీటుమీద కాస్త స్థలం వుంటే అక్కడ వేశాడు. అదేదో నిప్పు కొరకాసులా కనిపించిందేమో గభాల్న లేచి నిల్చుంది ఫామిలీ. సాయిబుగారు చెప్పులు తడిగా వున్నా పట్టించుకోకుండా వాటిని తీసి సీటుమీద పెట్టి, రుమాలు వాటిమీద కప్పి, కాస్త వెనక్కి నెట్టి తను కూర్చున్నాడు.

బండి స్పీడు యెక్కువైంది.

"కాలక్షేపం బఠాణీలు. ఆఁ .... యింకా యెవరికండీ బఠాణీలు....బఠాణీలు" అంటూ పెద్దబుట్ట ఒకటి వేసుకొచ్చి రెండు నిమిషాలు అరిచి పక్కకు వెళ్ళాడు.

"గాంధీగారిపాకం ... గాంధీపాకం....గాంధీ పాకం...." పేరు శెనగ పాకాన్ని చూపెడుతూ మరొకడు వచ్చాడు. గాంధీ — ఈ పేరు యెక్కడో విన్నట్టుందే అంటూ అల్లావుద్దీన్ మజ్జు ముఖంలోకి చూశాడు.

"గాంధీగారు...ఈ జాతి పిత; మహాత్ముడు. వీళ్ళంతా మర్చిపోయారు. ఏదో — ప్రమాణాలు చేసేటప్పుడు మాత్రం ఆ పేరు విని

పిస్తుంది. అంతే! ఈ పాకంవాడు నయం కదూ....రోజుకు వెయ్యి సార్లన్నా గాంధీ, గాంధీ అంటాడు — సహస్రనామ సంకీర్తనంలా" మజ్జా వివరించాడు.

"జాతి పిత పరపతి పాకం వరకు వచ్చిందా!" అనుకున్నాడు అల్లావుద్దీన్.

"టికెట్ ప్లీజ్! మీ టికెట్లు చూపించండి" అన్న మాటలు అవతల పక్కనుంచి వినిపించాయి. అంతే! ఆ పెట్టె అంతా కాస్తా దడ దడ లాడింది. అటువాళ్ళు యిటువాళ్ళు కాస్తా సర్దుకోవడం, తలుపు దగ్గరకు, బాత్‌రూం దగ్గరకు పరుగులెత్తడం మొదలయింది. రుమాలు సాయిబాబుగారు ఠపీమని లేచి, రుమాల్ని సీటుమీద వేసి—జర దేకో భాయి — అని మజ్జాకి ఆ బాధ్యత అప్పగించి మెల్లగా జారుకున్నాడు. ఫామిలీలో కూడా ముసలకం బయలుదేరింది.

"ఇదో—నడిపిదానికి తొమ్మిదేళ్ళు, చిన్నదానికి రెండున్నర అని చెప్పు. టికెట్లడిగితే పక్క డబ్బాలో మావారున్నారను. ఈ మాట పట్టించుకోకు. లగేజడుగుతాడు. ఏటి - వస్తా - సూళ్లూరుపేటలో కలుసుకుంటా" — యిన్‌చార్జి సాయిబు వెనకాలే బయలుదేరాడు. వాళ్ళతోబాటు మరో యిద్దరు నిష్క్రమించారు. అప్పటి దాకా ఆఫ్రికా అరణ్యంలా వున్న డబ్బాలోకి రవంత వెలుతురు, పిసరంత గాలి వచ్చాయి.

"ఏవిటి మజ్జా సూళ్లూరుపేట అని వెళ్ళిపోయాడు? ఏవిటి అంతా అటూ యిటూ కదుల్తున్నారు?" అమాయకంగా అడిగాడు అల్లావుద్దీన్.

"పూర్వం సూళ్ళూరుపేటలో పెద్ద డ్రామా కంపెనీ వుండేది. ఇప్పుడు నువ్వు చూస్తుందంతా డ్రామా; టికెట్ల భాగోతం. ఇండియన్ రైల్వే రెండో తరగతి పెట్టెలో యిలాంటి భాగోతాలు బోలెడు. చూస్తూ అర్థంచేసుకోవాల్సిందేగాని చెప్పుకోకూడదు ఈ భాగోతాల్ని." మజ్జా ముగించాడో లేదో బండి ఠకీమని ఆగింది.

"ఎవడో చెయిన్ లాగాడ్రా—" అన్నారెవరో. జనాన్ని తోసుకుంటూ యిటునుంచొక పోలీసు, అటునుంచొక పోలీసు దదేల్ దదేల్‌మని పరుగులెత్తారు. కిటికీల్లోనుంచి తలకాయలు బయటపెట్టి చోద్యం చూస్తున్నారంతా. ఒక కిటికీలోనుంచి అల్లావుద్దీన్ తల, మజ్జా తల బయటకొచ్చాయి.

"ఏవిటి మజ్జా...సూళ్ళూరుపేట వచ్చిందా? యెందు కాగింది బండి?" అల్లావుద్దీన్ అడిగాడు.

"సూళ్ళూరుపేటలో స్టేషనా బండి ఆగేది? యిదో భాగోతం—చెయిన్‌ల భాగోతం. ఎవడిల్లు యెక్కడ కనబడితే అక్కడే దేవుణ్ని తలుచుకోవడం చెయిను లాగడం—" మజ్జా చెప్పాడు.

"అదేవిటి తొందరగా వెళ్లామని కదా రైలు బండి ఎక్కాం. ఇట్లా చెయిను లాగి ఎక్కడ పడితే అక్కడ బండి నాపుజేస్తే ఎలా?"— అల్లావుద్దీన్ ప్రశ్నించాడు.



మనసుగతి ఇంతే అన్నాడు కవి. ఆ మనసు లోతెంతో తెలుసుకోండి!

వచ్చే సంచిక నుంచే

# మనసు సంగతి

ప్రముఖ మానసిక శాస్త్రవేత్త డా॥ శ్రీమతి జయానాగరాజ్ నిర్వహించే

కొత్త శీర్షిక వచ్చే సంచికలోనే ప్రారంభం.


"తొందరగా వూరు చేరాలంటే రైలుబండెక్కకూడదు. ఇంత చద్ది కట్టుకుని కాలినడకన బయలుదేరడం మేలు. ఏదో ఒక టైంకు వూరుకు వెళ్తావన్న నమ్మకముంటుంది!"

ఇంతలో ఎవరో దభేళ్ళున కిందకు దూకి పరుగు లంకించుకున్నాడు. వాడు పంపగజాలు పరుగెత్తిం తర్వాత ఇద్దరు పోలీసులు కిందకు దూకి కాసేపు వాడివెనకాలే పరుగెత్తి,వెనక్కు మళ్ళారు.

"ఇదంతా ఏవిటి మజ్జా విచిత్రంగా వుంది. అతను అర్జంటుగా మద్రాస్ పరుగెత్తాడా?"

"ఆఁ చూశావా నీక్కూడా అర్థమయింది ట్రిక్కు! అంతే. అర్జంటుగా వూరు చేరాలంటే లగెత్తడమే!"

"మరి పోలీసులెందుకు దూకారు?"

"వాణ్ని పట్టుకోడానికి!"

"మరి అంత ఆలస్యంగా దూకారేం?"

"వాడితోబాటు దూకితే దొరికిపోడూ! ఇదో భాగోతం!"

"మజ్జా మన మిత్రులు—పెద్దాయన, సాహెబ్‌గారూ...." అంటూ అల్లావుద్దీన్ రుమాలు సాయిబుగారినీ, ఫామిలీ ఇన్‌చార్జిని చూపించాడు. వాళ్ళిద్దరూ పక్కపెట్టె తలుపును పట్టుక వేలాడుతున్నారు.


"ష్. మన మిత్రులు అని గట్టిగా అరవమాక....వాళ్ళ దగ్గర టికెట్లు సరిగ్గా లెవ్వు. మనల్ని పట్టుకెళ్తారు—" అన్నాడు మజ్జా.

"ఎక్కడికి" అల్లావుద్దీన్ అడిగాడు.

"ప్రాజెక్టు రాళ్ళ కాడికి! నువ్వూ వొక్క సార్...."

పోలీసులు బండెక్కిం తర్వాత కూతపెట్టి నూడు తాంబేలులా కదిలింది బండి. ఆ ఇద్దరు తలలు లోపలకు లాక్కున్నారు. పెట్టెలుపెట్టే అటకమీద స్థలం కనిపిస్తే అల్లావుద్దీన్ని పైకెక్కించి—

"సార్....ఇక మీరు అడ్డే ప్రశ్న లడగకుండా చుమ్మ నిద్రపొండి. ఇది నేరుగా మదరాసు సెంట్రలు చేరిం తర్వాత లేద్దురుగాని—తూంగో సామి" అంటూ మజ్జా అల్లావుద్దీన్ని పడుకోబెట్టి తను ఒక సీటుపక్కన సర్దుకున్నాడు మదరాసు భాగోతాన్ని తలంచుకుంటూ. (ఇంకా వున్నాడు!)



# అల్లావుద్దీన్ అభినవ దీపం

దాసుబాబు

అల్లావుద్దీన్, మజ్జా మహానగరం మధ్యలోకి వచ్చిం తర్వాత, ఓ చౌరాస్తాలో నిల్చుని నలువైపులా పరికించారు. అన్నీ సినిమా బోర్డులే కనిపించాయి. అల్లావుద్దీన్ ముచ్చట పడ్డాడు.

"మజ్జా మనం ఏదన్నా సినిమాకెళ్దామా?"

"మనమా? సినిమాకా? ఇక్కడా?" మజ్జు ఆశ్చర్యపడ్డాడు.

"ఏం మనం సినిమా చూడకూడదా?"

"చూడొచ్చు సార్. కాని ఏ సినిమా చూద్దాం చెప్పు. నిజం చెప్పాలంటే నీ కథనే పది రకాలుగా మార్చి, హీరోల్ని మార్చి, పేర్లు మార్చి పాతిక సినిమాలు తీశారు.... యిప్పటికి."

"ఏంటి మజ్జా మార్చిమార్చి అంటున్నావ్? ఇది ఏప్రిల్ కదా! నాకేం అర్థం కావడంలేదు."

"చాలా పాత జోకు సార్! మీకు జీవితానుభవమే సరిగ్గా లేదు. సినిమా అనుభవం అసలే లేదు. మార్చి మార్చి ఈ మనుషులు చేసే పనులు నీకెలా అర్థమవుతాయి చెప్పు?" మజ్జు అనుభవం మీద చిన్నపాటి లెక్చర్ దంచాడు.

"అదేమన్నాసరే-నాకర్థమయ్యేటట్టు చెప్పాల్సిందే—" అల్లావుద్దీన్ వట్టుపట్టేడు.

"చూడు సార్! మాటకొక లెక్చర్ కొట్టొచ్చు. నా మాటలకు అంత బరువుంది. తమరు ప్రతి మాటకు బుంగమూతి పెడితే నేను చావాలి....వాటిని వివరించలేక! ఇక్కడ మార్పిడి బిజినెస్ చాలా స్ట్రాంగు. వీళ్ళు ప్రతిదీ మార్పిడి చేస్తారు. చెప్పుకోడానికే సిగ్గు. పోన్లే నువ్వడిగింది సినిమా గొడవ కదా, అదే చెప్తా. పొరబాటుగా ఏదన్నా సినిమా హిట్టయిందనుకో—"

"హిట్టంటే?" అల్లావుద్దీన్ అడిగాడు.

"బాగా డబ్బులు సంపాదించినదన్నమాట. ఆ హిట్టయిన సినిమా పేరు మార్చి, నటుల్ని మార్చి, పాటల్ని మార్చి, ప్రేక్షకుల్ని యేమార్చి మరో సినిమా తీస్తారు. మళ్ళీ దాన్ని చూసి మళ్ళీ మరొహిట....మళ్ళీ మళ్ళీ మరో హిట....మళ్ళీ మళ్ళీ—"

"ఛా-పూర్కో. ఎన్ని మళ్ళీలు?" అల్లావుద్దీన్ అడిగాడు విసుగ్గా.

"ఈ మాట అడగాల్సింది నన్ను కాదు; సినిమాలు తీసేవాళ్ళని. మజ్జు చేతులు కట్టుకుని ముఖం పక్కకు తిప్పి పోజు పెట్టాడు.

"పోనీ వాళ్ళు తీస్తే తీశారు. అందులో నటించే నటులకయినా...."

"అబ్బెబ్బే—వాళ్ళు ముడితే చాలు. తమ పనేదో తాము చేసుకుపోయే మంచివాళ్ళు."

"పో మజ్జా నువ్వన్నీ బడాయి మాటలు చెప్తావ్...."

"నిజం సార్! మన హీరోకి తెలివొచ్చేది ఇంటర్వెల్ తర్వాతనే....తెలుసా? అసలు చెప్పాలంటే ఇంటర్వెల్ తర్వాత కనిపించే హీరోకి ఇంటర్వెల్‌కి ముందు కనిపించే హీరోకి బుద్ధుల్లో పోలికలే వుండవు. అయినా హీరోలంతా నటించడంలే? అంతే...." మజ్జు బాధగా అన్నాడు.

"ఏమిటో మజ్జు, యింత ఖర్చుపెట్టి తీస్తారుకదా జాగ్రత్తగా తీస్తే పోలేదూ?" అల్లావుద్దీన్ సలహా విసిరాడు.

"ఆఁ ఆఁ జాగ్రత్తగానే తీస్తున్నారు అవి పోతూనే వున్నాయి. ఈదేశంలో పెద్ద అదృష్టం ఏమిటో తెలుసా? పాతికదాకా రకరకాల రాష్ట్రాలుండటమే. అందులో ఓ అరడజను భాషల్లో సినిమాలు వారానికొకటి బయట కొస్తాయి. ఆ సినిమాల్ని ఆ భాషవాళ్ళు, ఈ భాషవాళ్ళు చూశాక....మార్పిడి బిజినెస్ మొదలవుతుంది. అరవంనుంచి తెలుగుకి, తెలుగు నుంచి హిందీకి; మళ్ళీ హిందీనుంచి తెలుగుకి, తెలుగునుంచి అరవానికి! అంటే ఒకె సినిమా కొత్తగావుంటే ఆరు సినిమాలకు అమ్మ అవుతుంది!" మజ్జూ ఇకిలించాడు.

"అబ్బా....అంత గొప్పగా కొడతారన్న మాట 'కాపీ!" అల్లావుద్దీన్ నవ్వాడు.


"అహా—నీకూ అర్థమయిందే సిన్మాల సంగతి...." మజ్జు దీర్ఘం తీశాడు.

"ఇదంతా బాగానే వుంది కాని....ఇప్పుడు వున్నపళంగా ఏదన్నా సినిమాకి తీసుకెళ్ళు—" ఆదేశించాడు.

మజ్జు నొచ్చుకున్నాడు. కాని తప్పదు. అరవై ఓల్టుల బల్బు మహత్యం!

ఎత్తు, పొడవు, వెడల్పు—అన్నీ సరిగ్గా వున్న ఓ సినిమా టాకీస్ దగ్గర కొచ్చారు యిద్దరూ. సినిమా హాలు ముందు జనం కిటకిటలాడుతున్నారు.

"మజ్జా ఏమిటి ఇంతమంది వచ్చారు.... ఇక్కడేమయినా జాతర జరుగుతుందా?" అల్లావుద్దీన్ అడిగాడు.



"ఆహా! ఎందక్కా అడిగావ్ సార్! జాతరే ఇది. ప్రతి సినిమా ఇక్కడవాళ్ళకి జాతరే! ఆ సినిమా ఎలా వున్నా సరే - తిరనాళ్ళకొచ్చినట్టు జనం వచ్చి పడుతుంది. తిండికన్నా ఎందుకారు గాని సినిమా చూడకుండా వుండలేరు. రెండు ఇంగ్లీషు రాగాలు, రెండు ఇండియా రాగాలు జొప్పించి-నాలుగు డాన్సులు పెట్టి ఒక సినిమా తీసి ప్రజల మీదకు విసిరేస్తారు...." మజ్జూ గుక్క తిప్పుకోకుండా.

"అంతమాత్రానికే ఇంత విరగబడి సినిమాలు చూస్తున్నారంటావా?" ధర్మసందేహాన్ని వెలిబుచ్చాడు అల్లావుద్దీన్.

"చెప్పాగా. ఆ సినిమాలు అంతే ఈప్రజలు అంతంతే. పోతే ఒహళ్లే....ఇప్పుడు కొత్త ఫార్ములా కనిపెట్టారు. అది ఎంత మంచి సినిమా అయినా సరే ఏదో ఒక రీల్లో హీరోయిన్ గుడ్డలిప్పాల్సిందే; ఎక్కడో ఒకచోట రేప్‌సీను వుండాల్సిందే! హ్హ...."మజ్జు ముఖం సిగ్గు పడింది: పళ్లు బయటకొచ్చాయి.

"ఛీ, మరీ ఇంత పబ్లిక్కుగా అలాంటివా?"

"అదే గమ్మత్తు....పబ్లిక్కు వెళ్ళేదే వాటి కోసం! అవి లెవ్వనుకో—ఇక అంతే సంగతులు" మజ్జూ నవ్వాడు.

ఇంతలో గళ్ళ చొక్కావాడు అక్కడకొచ్చి, అల్లావుద్దీన్‌ని మజ్జూని ఎగాదిగా చూసి పక్కకు తిరిగి—

"మూడు రూపాయల్ ఐదు రూపాయల్" అన్నాడు. అవే మాటలు రెండు మూడుసార్లు అని, కాస్త దూరంగా వెళ్ళి నిల్చొని 'ఏమంటారు'—అన్నట్లు చూస్తూ వున్నాడు. ఇదేమిటి అన్నట్లు అర్థం కాని చూపులు చూశాడు అల్లావుద్దీన్.

"ఇదొక మార్పిడి బిజినెస్. మొత్తం టిక్కెట్లలో సగం కిటికీల్లో, సగం రోడ్డుమీద."

"సగం రోడ్డుమీదేమిటి?"

"ఇక్కడ నడిరోడ్డే నల్లబజారు! పట్టపగలే నిలువుదోపిడి! ముందుగా ఏవో కొన్ని టిక్కెట్లు మామూలుగా కిటికీల్లో అమ్ముతారు. మిగతా టిక్కెట్లన్నీ నల్లబజారుకు మెల్లగా జారుకుంటాయి. మూడు రూపాయల టిక్కెట్ అయిదు రూపాయల, కమ్మడం." కమీషన్ డబ్బులు అందరూ పంచుకోవడం."

"అందరూ అంటే—" అల్లావుద్దీన్ అమాయకంగా అడిగేడు.

"మనం కాదులే! కమీషన్ శక్తులు కొన్ని వుంటాయి. బతుకంతా కమీషన్ బతుకే" మజ్జు అసహ్యించుకొన్నాడు.

"మజ్జూ—యిక్కడేవిటి ఒకళ్ళ వెనకాల ఒకళ్ళు అంత పొడుగ్గా?"

"దాన్ని 'క్యూ' అంటారు. అంటే వరస క్రమం అన్నమాట. అసలు క్రమం మాట దేవుడెరుగు-వరసయితే వుంది. వీళ్ళంతా టికెట్లకోసం క్రమంగా జపం చేస్తున్నారు పాపం—"మజ్జూ జాలి ఒలకబోస్తూ అన్నాడు.


"ఇందులో పాపం ఏముంది మజ్జూ?"

"చెప్పాగా.... సగం టికెట్లు నల్లబజారు చేరుకుంటాయని. ఈ రోజు తప్పకుండా సినిమా చూడాలనుకుంటే బజారు పాపం పంచుకోవాల్సిందే!" మజ్జు వ్యంగ్య ధోరణి అల్లావుద్దీన్‌కి అర్థం కాలేదు. కాసేపు తటపటాయించి—

"ఏమో మజ్జు....నువ్వన్నీ పాపం మాటలు మాట్లాడుతున్నావ్. సినిమా చూపించు అంటే ఇంత కథ చెప్పితే ఎలా? ఏ గోడమీద చూసినా సినిమా గొడవే గదా, పాపం అంటే ఎలా? ఎన్నో లక్షలు ఖర్చుపెట్టి సినిమాలు తీసి కళాపోషణ చేస్తున్నారుకదా....నువ్వింత నిర్దయగా మాట్లాడితే ఎలా?" అల్లావుద్దీన్ తెలివిగా మాట్లాడాననుకున్నాడు. మజ్జూ వూర్కోలేదు.

"కళాపోషణ కాదు సార్....ఉగర పోషణ! ఇన్ని లక్షలు పెట్టి కళాసేవచేస్తేమహానుభావులెవరున్నారు? అయినా లక్షలు....కోట్లు పెట్టి కళాపోషణ అంటే చాలా ప్రమాదం....ఏమీ లేదు చిప్ప చేతికొస్తుంది. నిజం చెప్పాలంటే అసలు కళాపోషణ చేసేది తీసిన ప్రతి సినిమాని నమ్మకంగా చూసే పేద ప్రజానీకం. నిజానికి వాళ్ళ అండదండలే గనుక సినిమా






వాళ్ళకు లేకపోతే - భిక్షాందేహి"-మజ్జు పళ్ళు బయటకొచ్చాయి. చివరి మాటలు అర్థంకాకపోయినా అల్లావుద్దీన్ కూడా నవ్వాడు....మజ్జు పళ్ళు చూసి.

"పోతే ఒహళ్లే, అప్పుడప్పుడు కళాఖండాలు వస్తూనే వున్నాయి. అయితే అందులో కూడా గమ్మత్తు వుంది. కళాఖండాలుగా వుండాలని సినిమాలు తియ్యడం లేదు. అవి బయటకొచ్చి, తెర ఎక్కాక కళాఖండాలు అని ప్రజానీకం అనేసరికి—నిజమేమోనని నిర్మాతలు జబ్బలు చరుచుకుంటున్నారు. అంతేగాని సినిమాలో కళేమిటి....అంతా వ్యాపారం....మార్పిడి బిజినెస్—" మళ్ళీ మొదటికొచ్చాడు మజ్జు.


"పోన్లే మజ్జు-వ్యాపారం అంటున్నావ్‌గా - ఎవరో ఒకరు బాగుపడతారు."

"అంతే అంతే— ఎవరో ఒకరే బాగుపడతారు. ఈ సినిమాలో నువ్వు తెల్సుకోవలసిన సత్యం మరొకటి వుంది. ఇందులో బాగుపడే వాళ్లకన్న నష్టపొయ్యే వాళ్ళే ఎక్కువ"

"అంతే నంటావా?"

"ముమ్మాటికీ అంతే సార్. చూశారా ఇక సినిమా' యేం చూస్తాం హౌస్ ఫుల్. అంటే టిక్కెట్లు లేవు అని అర్థం. ఇంకా చెప్పాలంటె రోడ్డుమీద టిక్కెట్లు కొనండి అని అర్థం. అవి ఎలాగూ మనం కొనం. పదండి సార్ అన్నపూర్ణాలో మీకు డబుల్ స్ట్రాంగ్ కాఫీ తాపిస్తా" మజ్జు హోటల్ వైపు దారి తీశాడు. అతని వెనకాలే వెళ్ళక అల్లావుద్దీన్‌కి తప్పలేదు.

(ఇంకా వున్నాడు)



# అల్లావుద్దీన్ అభినవ దీపం

దాసుబాబు

మజ్జా ప్రత్యక్షమై—

"ఏం అల్లావుద్దీన్ సాబ్....అరవై వోల్టుల బల్బు ఖర్చు లేకుండా దొరికింది కదా అని యెప్పుడు పడితే అప్పుడు తోమడమేనా?" అని విసుగ్గా అడిగాడు.

"మరేం చెయ్యమంటావ్? నువ్వు లేకుండా ఈ లోకంలో ఒక్క క్షణంకూడా బతకలేక పోతున్నాను...." అల్లావుద్దీన్ బుంగమూతిపెట్టి అన్నాడు.

"ఈ డైలాగు యే అమ్మాయితోనైనా చెప్పు....అక్కరకొస్తుంది. హుం! ఏ క్షణాన నా దీపం నీచేత చిక్కిందోకాని....నా బతుకూ అంతే అయింది. క్షణం క్షణం నీ సేవే! వేరే ధ్యాసే లేకుండా చేశావు. ఇంతకీ యిప్పుడు ముంచుకొచ్చిన ప్రమాద మేమిటి?" మజ్జా అడిగాడు.

"చూడు మజ్జా, మనం ఈ లోకంలోకి వచ్చి అర సంవత్సరం నిండుగా గడిచి పోయింది. కాని నా బతుకే వెలితిగా మిగిలి పోయింది—" అల్లావుద్దీన్ నిట్టూర్చాడు.

"తెలుగు సినిమా యేదన్నా చూశావా యేం? అచ్చంగా తెరభాష దూకుతోంది నోట్లోంచి!" అని మజ్జా నవ్వాడు.

"నీ కంతా నవ్వులాటగా వుంది. వచ్చి యిన్ని రోజులయింది; ఏదీ ఇల్లు లేదాయె—వాకిలీ లేదాయె; ఉద్యోగం లేదాయె—సద్యోగం లేదాయె; చదువు లేదాయె — చట్టుబండ లేదాయె—ఏవిటీ దారుణం?" అల్లావుద్దీన్ ఆవేశంగా అన్నాడు.

"ఈ దేశంలో ఏవున్నా లేకపోయినా చట్టుబండలకేం కొదువలేదు! మీకు ఉద్యోమేగా కావల్సింది, చూద్దాం—" మోర పైకెత్తాడు మజ్జా.

"ఈ దేశంలో ప్రతివాడూ చూద్దాం అనే వాడేగాని చేద్దాం అనేవాడు ఒక్కడూ కనిపించడు. సరే, అర్జంటుగా నాకు ఉద్యోగం కావాలి. ఇది నా ఆజ్ఞ—" కాస్త కోపంగా అన్నాడు అల్లావుద్దీన్.

మజ్జు కాసేపు ఆలోచించే—

"ఉద్యోగం పురుష లక్షణం అన్నారు పెద్దలు. ఆ లక్షణం నిరూపించుకోడానికైనా మీరు ఉద్యోగం చేయడం మంచిదే! కాని—సార్—మన కెవరిస్తారు సార్—ఉద్యోగం?...."

"మనం—అంటా వేవిటి? ఉద్యోగం నాకు....నీ కెవడిస్తాడు? చూడు యేదన్నా మార్గం—" అక్కడే చెట్టుకింద చతికిల బడుతూ అన్నాడు. మజ్జా కూడా కూలబడి, ఆకాశంకేసి కాసేపు చూసి—చటుక్కున లేచి





నిలబడ్డాడు.

"సార్....అల్లావుద్దీన్‌గారో ........ మీరు అదృష్టవంతులండీ! ఇక్కడ ఉచ్చురావుగా రని ఓ పెద్ద మనిషున్నాడు. అతణ్ని కలుసుకుంటే...."

"ఉచ్చురావుగా రేంటి మజ్జూ....అ పేరు...."

"ఉచ్చురావుగా రంటే—ఉద్యోగాలు చూపించే రావుగా రన్నమాట. ఉచ్చు—పొడి అక్షరాల పేరు. రండి....ముందు ఆ పెద్ద మనిషిని కలుసుకుందాం—" మజ్జు దారి తీశాడు. అల్లావుద్దీన్ అతని వెనకాలే నడిచాడు.

ఓ పెద్ద భవనం ముందు ఆగారు. గేటు వాచ్‌మన్‌తో కాసేపు ఘర్షణపడి — ఓ రూపాయి ముడుపు చెల్లించి—ఉచ్చురావుగారి గదిలో తేలారు. నేరుగా వెళ్ళి ఉచ్చురావుగారి బల్ల ముందు నిల్చుని నమస్కారం చేసి.... కుర్చీల్లో కూర్చున్నారు. ఉచ్చురావుగారు వాళ్ళ నమస్కారాన్ని పుచ్చుకోలేదు; వాళ్ళ నసలు పట్టించుకోకుండా—టెలిఫోను మోగకముందే —రిసీవర్ని ఎత్తి చెవి దగ్గర పెట్టుకుని—

"ఆఁ .... ఎవురూ .... ఆఁ....మంత్రిగారా? నమస్తే నమస్తే. ఏదో, మామీద దయ కలిగినట్టుంది....సరే,గాని....మొన్న ముగ్గుర్ని మీ దగ్గరికి పంపించానే వాళ్ళకి ఉద్యోగం వేయించారా? ఆఁ ఉద్యోగాలు ముగ్గురికీ దొరికాయా? బావుంది. ఏదో నా మాట నిలబెడుతున్నారు. పరోపకారం చేస్తే పుణ్యం దక్కుతుందంటారు—ఈ జన్మ కంతకంటే ఇంకేం కావాలి చెప్పండి? అందుకే నన్నాశ్రయించి చాలా మంది...."

—ఈ మాటలు అల్లావుద్దీన్‌కి ఒక పట్టాన అర్థం కాలేదు. పోతే, మజ్జూకి బాగా అర్థమయింది కాబోలు—రెండు చేతులు జోడించి, గురుభక్తిని వొలకబోస్తూ, వినయం పుట్టి పడుతూ వుంటే—

"అయ్యా రావుగారూ....ఇక చాలండి. మంత్రిగారితో మాటలు ఆపుచేసి ముందుగా నా నమస్కారాన్ని స్వీకరించండి. ఆహా....నిస్సలైన పుణ్యాత్ములు ఎన్నాళ్ళకు ఎదురయ్యారండి! మీ దేవిఁ జన్మో కానీండి!...మీ దరిదాపుల్లో కొస్తేనే మా జన్మలు తరించిపోతాయి. వంగలేను....లేకపోతే కాళ్ళమీద పడి...."

—మజ్జు ముగించకముందే, వినయ చిహ్నాలు ముఖం నుంచి మాయం కాకముందే—

"వద్దు బాబు! అసలే మరుగుజ్జువి, బల్ల కింద దూరిపోతావు"—ఉచ్చురావుగా రన్నారు. ఆ మాటలు అర్థమయ్యాయేమో, అల్లావుద్దీన్ పకపకా నవ్వాడు. అయినా మజ్జు చలించలేదు.

"సార్....మీరు పంపించే వాళ్ళందరికీ మంత్రిగారు ఉద్యోగాలు వేశారంటే....మీ పలుకుబడి యెంత మందంగా ఉందో ఊహించుకోలేక ఉక్కిరి బిక్కిరి అవుతున్నా ననుకోండి—"

"చాలు—పై కొస్తావు. మంత్రిగారితో చెప్పమన్నావా నీకు ఉద్యోగం కావాలని?—"

అల్లావుద్దీన్ బిత్తరపోయాడు.

"అబ్బే నాక్కాదండి—వీర విక్రమ పరాక్రమోపేదుడు శ్రీమాన్ అల్లావుద్దీన్‌గారికి—వీరే వారు—" పరిచయం చేశాడు.

"ఏవిటీ అక్రమం? పిల్లికూనలా వున్నాడు. ....ఇతడా అతగాడు?"

అల్లావుద్దీన్ ముఖం కందిపోయింది.

"మీ మీద ఒట్టు—యితడే నండి అల్లావుద్దీన్. ఇతనికే నండి ఉద్యోగం—"

ఉచ్చు రావుగారు అల్లావుద్దీన్ని యెగా దిగా చూసి—

"మాయాదీపం సాయంతో రాకుమారిని అప్పుడోసారి మీ గదిలోకి రప్పించుకున్నారుగా అప్పుడె మనిపించిందండీ?!" నోరూరించుకుంటూ అడిగాడు.


"భయం—అనిపించింది."

"భయమా—ఎందుకు?"

"దీపం పోతుందేమోనని—" తల తిప్పి మజ్జుకేసి చూస్తే తన ప్రశ్నలకి జవాబు చెప్పేది మజ్జూ అని తేలింది. ఉచ్చురావు ముఖం చిట్లించి—








"కాస్తా నువ్వు నోరు కట్టేస్తావా? ఆఁ.... అయితే, భయంకొద్దీ ఆ మాయా దీపాన్ని భద్రంగా వుంచుకొస్తున్నారన్నమాట! మరి.... అంత అద్భుత దీపం పెట్టుకుని బంగారు కాసులు కురిపించుకోక మీ కెందుకండి ఉద్యోగం?...."

అల్లావుద్దీన్ మజ్జు కేసి చూశాడు.

"కాసులేం కర్మండీ, కావాలంటే బంగారపు యిటుకల్నే కురిపించొచ్చు. ఎటొచ్చి సొంతానికవి పనికి రావు. మాది కూడా పరోపకార సంస్థే—"

"బావుంది. మీరు లోపలికొస్తూంటేనే అనుకున్నా. అందరికీ నేను సహాయం చేస్తుంటే, యివాళ నాకు సహాయం చేసేవాళ్ళొస్తున్నారని. ఆఁ....యేవీఁ లేదు. మన సంస్థని కాస్త విస్తృత పర్చాలని కోరిగ్గా వుంది. యెన్నో అక్కర్లేదు. ఏదీ ఒక్క యిటుక—ఒకటంటే ఒకటి చాలు" అభ్యర్థిస్తూ అన్నాడు.

"మరి మా సార్‌కి ఉద్యోగం యిప్పిస్తారా?"

"ఓ బంగారపు యిటుక యిటు పారెయ్యండి, చదువున్నా లేకపోయినా, అనుభవం వున్నా లేకపోయినా ఒక మాంచి ఉద్యోగం వేయిస్తా—యిటుక........" ఉచ్చురావుగారు మ్యావ్ మ్యావ్ మన్నారు.

"చదువు....అనుభవం అంటున్నారు...." అల్లావుద్దీన్ గొణిగాడు.

"అదంతే నండి! మీరు బియ్యే చదివి ఉద్యోగానికి దరఖాస్తు పెట్టారనుకోండి. అది చాలదు. కనీసం అయిదేళ్ళ అనుభవం వుండాలి!"

"అయితేసార్, అటు పాతపనివాళ్ళకూ మీ ఉద్యోగాలు పనికిరావు; యిటు కొత్త చదువులకీ ఉద్యోగాలు అందవు. అనుభవం సంపాయించిపెట్టిన ఉద్యోగాన్ని వదులుకొని ఎవరూ రారు. కొత్తగా కాలేజీనుంచి బయటపడిన వాడికి అనుభవం యెక్కడి నుంచొస్తుంది?" మజ్జూ చిన్నపాటి లెక్చర్ దంచాడు.

"అందులోనే వుంది తిరకాసు! ఈ నాడు లక్షల్లో డిగ్రీలు సరఫరా అవుతుంటే ఉద్యోగాలి యెవరి కివ్వమన్నావ్? అందుకే అర్హతలనీ, అనర్హతలనీ కొన్ని ప్రత్యేకమైన నిబంధనలు పెట్టి—వడపోసి పారేస్తారు. మిగిలినవాళ్ళకి, ఉత్తరాలూ, దక్షిణాలూ చూసుకుని ఉద్యోగాలు వేస్తారు....నా లాటివాడు నూటి

క్కోటికి ఒక్కడుంటాడు. ఉద్యోగంకోసం వచ్చినవాణ్ణి మరీ నిలువుదోపిడి చెయ్యకుండా, మినిష్టర్‌గారితో ఒక మాట చెప్పి—మన పలుకుబడిమీదనే ఉద్యోగం వేయిస్తా. ఇది గుర్తుంచుకోండి—మా వంశం హరిశ్చంద్రుడి వంశం" చివరి మాటలకి చేతులు కట్టుకుని, తల పక్కకి తిప్పుకుని యింటి కప్పుకేసి చూపులు మళ్ళించాడు.

కాసేపు అల్లావుద్దీన్, మజ్జూ మౌనంగా వున్నారు.

"అయితే సార్ నిలువుదోపిడి లేదన్నారుగా....మరి... మా సార్ ఉద్యోగం...." మజ్జూ నసిగాడు.

"అది నా కొండిలెయ్. కాకపోతే ఒకటి. నే నడక్కపోయినా, మీ లాంటివాళ్ళు అభిమానం కొద్దీ ఆఫీసు ఖర్చులకని నాల్నెల్ల జీతం అడ్వాన్సుగా యిస్తుంటారు. నా సాదర ఖర్చు కని ముందు వో వంద పుచ్చుకుంటాను. యిలాంటి చిల్లర ఖర్చులు ఉద్యోగం దొరికే వరకు వుంటాయనుకోండి. అంటే మన దగ్గరేవీ ఆలస్యం కాదు. మినిస్టర్‌గారు అస్తమానం టూరు వెళ్తుంటారా....అదే ఇబ్బంది. మీకు యీ గొడవలేవీ లేకుండా ఉద్యోగం కావాలంటే—వో బంగారు యిటుకను యిటు రానివ్వండి!"

అల్లావుద్దీన్ మళ్ళీమజ్జూకేసి చూశాడు ఆశగా.

"బంగారపు యిటుక అంటే పెద్ద కష్టమేమీ కాదనుకోండి. పోతే మాయా దీపంలో తైలం పొయ్యాలి. పెద్దగా ఏం కాదులెండి. ఓ వంద చాలు—"

ఉచ్చురావు కళ్ళు మిటమిటమన్నాయి.

"ఆలోచించుకోండి. బంగారం యిటుకను బజారులో పెడితే లక్షరూపాయ లొస్తాయి. వంద యెన్నో వంతు?"

మజ్జు కళ్ళెగరేశాడు.

"పొద్దున్నే బోణీ జరిగింది. ఇంద వంద, రానియ్ బంగారం యిటుక—" ఉచ్చురావు వంద నోటు అల్లావుద్దీన్ చేతిలో పెట్టాడు.

దాన్ని మజ్జూ లాక్కుని—

"ఏదీ మీరు పెట్టుకొన్న టోపీ ఇటివ్వండి" ఉచ్చురావు తీసి మజ్జుకిచ్చాడు. దాన్ని తీసుకుని-

"ఆహా! ఏం టోపీ సార్ యిది—" ఆశ్చర్యంగా అన్నాడు.

"ఖద్దరు టోపి. మంత్రిగారు చదివించారు...." తడుముకోకుండా జవాబిచ్చాడు ఉచ్చురావు.

"రోజు కెన్నిసార్లు పెడుతుంటారు సార్ దీన్ని?"

"అదేం ప్రశ్న? బుర్ర గోక్కున్నప్పుడల్లా తీసి పెట్టుకుంటూ వుంటాను—"

"అబ్బా....అంత తేలిగ్గా టోపీ పెడతారన్న మాట. సరే, మీకు బంగారం యిటుకేగా కావల్సింది."

"అంతె....అంతే....ఒక్కటి చాలు—" లాలాజలాన్ని మింగుతూ అన్నాడు.

"అయితే అల్లావుద్దీన్ సార్, ఈ టోపిని తమరు ఉచ్చురావుగారి బుర్రమీద పెట్టండి—పెట్టండి సార్ ఫర్వాలేదు—" టోపీ అల్లావుద్దీన్‌కి అందిస్తే, అల్లావుద్దీన్ ముందుకు వంగి ఉచ్చురావుగారి తలమీద టోపీ పెట్టాడు. అది బంగారం యిటుకయింది!

"ఆశ్చర్యం! అద్భుతం!! అబ్బ! ఈసారి ఎలక్షన్లో ఎమ్మెల్లేని కాకపోతే యిటుకమీద ఒట్టే!! ఒహో....హో....ఏం అద్భుతం ఆహాహా—" ఉచ్చురావు ఊగిపోతూ.... తన్మయత్వంలో పలకరిస్తూవుంటే-మజ్జూ అల్లావుద్దీన్ని గిల్లి తలుపు దగ్గరకెళ్ళి నిల్చున్నాడు.

అల్లావుద్దీన్ కూడా మెల్లగా అక్కడకు వెళ్ళాడు.

"అయ్యా ఉచ్చురావుగారు....వందకి వంద నాలు! మీ నెత్తిమీదున్న బంగారం యిటుక వద్దనుకుంటే మీ టోపి మళ్ళి మీకు వచ్చేస్తుంది. ఇటుకని తలమీద నుంచి తీశారను కోండి—దాంతోబాటు మీ తలకాయ కూడా వూడి వస్తుంది; పాడెకు మిగిలేది మొండెమే-అది గమనించి నడుచుకోండి—అటూ ఇటూ మెసిలేరా హాంఫట్, ట్ర్వాయ్" అంటూ రకీమని తలుపువేసి, పరుగు లంకించుకున్నాడు మజ్జు—వంద వున్న జేబును గట్టిగా పట్టుకుని. అతని వెనకాలే మహావీరుడు అల్లావుద్దీన్ కూడా పరుగెత్తక తప్పింది కాదు.

(ఇంకా వున్నారు)

# బావా మరదలీయం

గుళ్ళపల్లి డి. చింతామణి

"హలో బావా! కంగ్రాట్స్!" అంటూ హడావుడిగా బట్టలుతుకుతున్న చేతుల్తోటే వచ్చి చేతులు పట్టుకుని కుదిపేసింది హేమ. (ఓమాట-హేమ మన హీరోయిన్. చక్కటి రూపం, ఎత్తరి—తగ్గట్టు ఒళ్ళు, దొండపండులాటి పెదవులు, కొట్టవచ్చినట్టు ఆ ముక్కు, నవ్వితేనే సొట్టలు పడేట్టుండే ఆ పాలబుగ్గలు—అలా నవ్వితేనే ముత్యాలు రాలేయా! అ[illegible] భ్రమింప చేసేంత చక్కటి పలువరస, కలువపువ్వులాంటి కనులు, పూరేకల్లాంటి రెప్పలు, హరివిల్లంటి కనుబొమలు, పిరుదలమీద జీరాడే పొడుగుజుసంలాటి జడ—అబ్బే! ఏం తేడా లేదార్ [illegible] మన సగటు తెలుగు సినిమా హీరోయిన్ అన్నమాట!) సుబ్బారావుని (ఖర్మ [illegible] సుబ్బిగాడే మన హీరో సార్! [illegible] (ఖ[illegible]నివాడు దున్నపోతయి పుట్టున్" [illegible] ప్రిన్సిపల్ కూడా తెలిసి [illegible] టి సినిమాచూస్తే వుండే [illegible]టాయి! ఒక్క అమ్మా [illegible] పేరు తగిలించలేనం [illegible] పరాప్ ఇన్ఫిటి— [illegible] ప్పిన పట్టాకాగితాన్ని గాల్లో [illegible] పెళ్ళి—పెళ్ళి [illegible] "ఉద్యోగ[illegible] వచ్చేం—ఉద్యోగం [illegible] సిరుద్యోగి [illegible] కూడా [illegible] షికారు [illegible] అసి [illegible] సదా రెడ్ [illegible] చూపించే మన సుబ్బిగాడు. హేమ వరి [illegible] పట్టి [illegible]నం, ధ్రువపొంగలి, ముద్ద [illegible] బియ్యప్పరవాన్నం (దానలిమాసుల క్షమించాలి) సగ్గుబియ్యం జావ — అవండీ మనవాడి క్వాలిఫికేషన్లు—తిట్టకండి సార్—నేను ముందే చెప్పాగా! మనవాడు అమాయక ది గ్రేట్ అని.)

హయ్యో, హయ్యో అని ఎనభయి యెనిమిది మెలికలు తిరిగిపోతున్న సుబ్బారావుని లోపల్నుంచి వస్తున్న సావిత్రమ్మచూసి(ఇదిగో ఈవిడే సార్—మన హీరో, హీరోయినుల మధ్య కాంక్రీటు వంతెన లాంటిది; హీరోయిన్‌కి మాతృదేవి. పెద్దవయస్సును తప్పని సరిగా మోస్తున్న ఆవిడ. వేరే మగదిక్కు లేనిదీ, రైలుకి ఇంజను, గార్డుపెట్టెల మధ్య వుండే బోగీల లాటిది.) ఏవయ్యో, సుబ్బారావూ! ఉద్యోగం ఇంకా రాలేదుకదా అనిచెప్పి భరతనాట్యం నేర్చుకుంటున్నావా ఏమిటి? అంది.

అబ్బే! లేద త్తయ్యా, అదేంలేదు, అదేం లేదు—మరీ అంటూ చెప్పబోతున్న సుబ్బారావుకి పళ్ళుబిగించి అపరకాళిలా చూస్తూన్న హేమ కనిపించి గతుక్కుమని వళ్ళంతా చెమటలు పట్టగా, "శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం" అంటూ ఆంజనేయ దండకంలోకి దిగిపోయి ఆ ఖంగారులో పైకే చదివేసేడు.

కిసుక్కున నవ్వి—ఏవిటి బావా! ఆంజనేయ దండకం చదువుతున్నావ్ అంది హేమ.

తల పైకెత్తే ధైర్యంలేక కంగారు పడిపోతూ అబ్బే ఏంలేదు, ఏం లేదు అన్నాడు పాపం సుబ్బారావు గోళ్ళుగిల్లుకుంటూ.

అరె! అదేవిటీ, పెళ్ళిచూపుల్లో పెళ్ళి కూతురు కూచున్నట్లు గోళ్ళు గిల్లుకుంటూ కూచున్నావ్!?

తప్పనిసరిగా తల పైకెత్తి చూసిన సుబ్బా



# అల్లావుద్దీన్ అభినవ దీపం

దాసుబాబు

## అల్లావుద్దీన్ 'కష్టం'

బల్బు రుద్దగానే ప్రత్యక్షమయ్యాడు మజ్జు. అల్లావుద్దీన్ చిరచిరలాడుతూ, కళ్ళెర్రజేసి మజ్జుకేసి చూశాడు. మజ్జు పరిస్థితిని ఇట్టే పసి కట్టేశాడు. అల్లావుద్దీన్‌కు ఉద్యోగేచ్ఛ యింకా చావలేదు.

"అల్లావుద్దీన్ సార్.... నీ.క్కావలసింది ఉద్యోగమేగా? రా నాతో. ఇక్కడ ఓ రానా వున్నాడు. మళ్ళీ ట్రయిచేద్దాం" మజ్జు అన్నాడు.

"రానా? ఇదేం పేరు?" అల్లావుద్దీన్ అడిగాడు.

"రానా అంటే రాజకీయ నాయకుడు. మరు గుజ్జుకు ముద్దుగా యివ్వ మజ్జు అనడంలేదూ? ఆయన రేషన్ కార్డులాగా యింటికో వుద్యోగ మని ప్రమాణం చేశాడు. రండి వెళ్దాం" మజ్జు దారి తీశాడు. ఎలాంటి ఉద్యోగ మిస్తాడోనని ఆలోచించుకుంటూ అల్లావుద్దీన్ అతని వెన కాలే నడిచాడు.

రానా భవనం ముందు ఆగారు.

అల్లావుద్దీన్ భవనంకేసి ఎగాదిగా చూశాడు. రెండంతస్తులు. అంతస్తుకో రంగు. ముందు రంగు రంగుల పూల కుండీలు, మొక్కలు, కుక్కలు, మనుష్యులు, సందడి-సంబరం-పెండ్లిల్లులా వుంది.

"అబ్బ మజ్జు, ఏం భవనం! ఇటువంటి ఇంద్రభవనమే మనకుంటే?" అల్లావుద్దీన్ ముచ్చటపడుతూ అన్నాడు.

"ఉండదు. వుంటానికి వీల్లేదు...." మజ్జు కటువుగా అన్నాడు.

"ఏంటి మజ్జు మరీ అంత కఠినంగా అనే స్తావు! ఎందుకు వుండకూడదు?"

"ఎందుకా? ఈ భవనం ఈ రానాగారికి నీ కలల ప్రకారమే దక్కింది కనుక!"

"నా కలల ప్రకారమా?"

"ఆఁ. పూర్వం రాబందు అనే మహాశయు డొక డుండేవాడు. అతని అసిస్టెంటు మన రానా—"

"అసిస్టెంటు ఏవిటి, స్టంటు మాస్టరులాగా?" అల్లావుద్దీన్ ముఖం చిట్లించాడు.

"రాబందు అంటే—రాజకీయ బంధువు అన్నమాట! స్టంటు మాస్టరన్నావే అది కరక్టే. మన రానాగారు రాబందుగారి దగ్గర శిష్యుడి లాగా చేరి ఇక్కడి సమాచారం అక్కడ.... అక్కడి సమాచారం ఇక్కడ; ఇక్కడి అక్కడి సమాచారం మరెక్కడో అందిస్తూ సమయం సందర్భం కలిసొచ్చేసరికి....రాబం దుకి ఎసరు పెట్టి, అమాంతంగా ఆకాశంలోకి ఎగరవేసి తను, ఈ భవనంలో తిష్ట వేశాడు. ఇప్పుడిది అతని స్వంతం!"



"అబ్బా! అంత తెలివి గలవాడన్న మాట! ఏదయినా దక్కించుకున్నవాడే గొప్పవాడు" అల్లావుదీన్ అన్నాడు.

మజ్జు, అల్లావుద్దీన్ రానా భవనంలో ప్రవే శించి రానాగారి ప్రత్యేక గదిలోకి వెళ్ళి వారి ఎదురుగా కూర్చున్నారు.

బొద్దుగా, పుష్టిగా—తల మీద పెట్టుకున్న టోపీకి న్యాయంచేసేలా వున్నాడు రానా. టోపీ సరిచేసుకొని ఏం కావాలి అన్నట్లు కళ్ళను తిప్పాడు.

"వీరి పేరు అల్లావుద్దీన్. ఏవీ అక్కర్లేదు సార్! చిన్నపాటి ఉద్యోగం వేయిస్తే చాలు!" మజ్జు ప్రాధేయపడ్డాడు.

రానాగారు చిరునవ్వులు వొలకబోస్తూ—

"పొట్టివాడివయినా గట్టివాడివే! "అన్నాడు.

అల్లావుద్దీన్ నవ్వాడు. మజ్జు ముఖం ఎర్ర బడింది.

"ఏం చదివి వచ్చావ్?" రానా అల్లావుద్దీన్‌ని అడిగాడు.

"ఏవీ చదవలేదండి. వేలుముద్ర వెయ్యడం తెలుసు ఈ అబ్బాయిగారికి—" మజ్జు తపీమని చెప్పాడు. ఈసారి అల్లావుద్దీన్ ముఖం ఎర్ర బడింది.

"వేలుముద్రగాళ్ళకు ఉద్యోగాలు దొరకవు. కష్టపడి పేరు సంపాదంచుకుంటే పదవులూ, పదవితోపాటు నాలుగు పైసలు కూడా సంపా దించుకోవచ్చు. కాని....చాలా కష్టపడాలి. ఉద్యోగమంటే తేలికా...."

"అది కాదు సార్. తమరేదో ఇంటికో ఉద్యోగం అని ప్రమాణం చేశారు.... అదే మన్నా గుర్తుంటే...."

"గుర్తుంది. అసలు మర్చిపోవడం అనేది మన జాతకంలోనే లేదు. ఇప్పటికీ అదే మాట అంటున్నా. ఇంటకో ఉద్యోగం వుండాలి. మేం యిచ్చి తీరుతాం—ఖాళీలు పడగానే. దేశంలో వున్న వుద్యోగాలన్నీ ఫిండుగా వున్నాయి. వెలితి అవగానే మన ప్రమాణం మేరకు వాటిని భర్తీ చేస్తాం. అప్పుడిక వేలి ముద్రలనీ, కాలు ముద్రలనీ వుండవు. కుటుంబ ప్రతినిధిగా వుద్యోగాన్ని పొందవచ్చు. మీ అల్లావుద్దీన్‌కి ముందుగా వుద్యోగం వేయిద్దాం సరేనా?"

రానా గుక్క తిప్పుకోకుండా ఉపన్యాసాన్ని దంచేశాడు. అల్లావుద్దీన్ కండ్లు మెరిశాయి-ముందుగా వుద్యోగం వేయిద్దాం అన్నందుకు. కాని ఆ మాటల్లో ఏదో తిరకాసు వున్నట్లు మజ్జు అనుమాన పడ్డాడు.

"సార్ మీరు చెప్పింది నిజమే కాని— ఇప్పుడు దేశం నిండుకుంది....ఎక్కడా ఖాళీ సలం కనిపించడంలేదు కదా మరి మా అల్లా వుద్దీన్‌కి ఉద్యోగం ఎప్పుడు దొరుకుతుం దంటారు?" మజ్జు అడిగాడు. రానాగారు టోపీ సరిచేసుకుని—

"అయిదేళ్ళ ఆరో ప్రణాళిక ఏడో పడికో వడ్డప్పుడు పరిస్థితులు మెరుగవుతాయి. అప్పుడు ఉద్యోగం వున్నవాళ్ళకు యిల్లూ, ఇల్లు వున్న వాళ్ళకు ఉద్యోగం అవలీలగాఇచ్చేసెయ్యొచ్చు-సరేనా?" తృప్తిగా చెప్పారు రానాగారు. అల్లావుద్దీన్ కడుపు నిండింది. మజ్జు ఫూర్కో లేదు.

"మీ ఉద్యోగ ప్రణాళిక చాలా బావుందండి. ఇల్లూ, ఉద్యోగం వచ్చేసరికి తెల్లారిపోయేటట్టు వుంది. అది సరేగాని సార్. ఇందాక తమరేదో వేలిముద్రగాళ్ళకు పదవులు అన్నారు....మా అల్లావుద్దీన్ వేలికి ఏదన్నా పదవి చూపిద్దురూ పోనీ అలాగైగా బతికేస్తాడు." మళ్ళీ మజ్జు ప్రాధేయపడ్డాడు.

"నువ్వు చాలా తెలివైనవాడివి. వృద్ధిలో కొస్తావు. నేను సరిగ్గా పదవిని గురించే ఆలో చిస్తున్నా నువ్వు అదే అడిగావు. అవశానికి మరుగుజ్జువే అయినా ఆకాశానికెగిరే తెలి వుంది-శక్తివుంది-సంతోషం—"

"పదవి సార్—"


"వస్తున్నా. వేలిముద్రంటున్నావుగదా .... ఏదన్నా బోర్డుకి చయిర్మన్‌గా వెయ్యాలి—" రానా కళ్ళు బోర్డుల్ని వెదకసాగాయి.

"అదేంటి మజ్జు బోర్డు అంటున్నాడు— బ్లాక్‌బోర్డు కాదుగదా?" అల్లావుద్దీన్ అమాయ కంగా అడిగాడు.

"ఎంచక్కా అడిగావు నాయనా. బోర్డు

# మెరిసేదంతా బంగారం కాదు

విదేశీపేరుతో చాలవరకు నకిలీ సరుకులు చలామణి అవుతున్నాయి.



వాటిమీద విదేశీ మార్కులుకూడా అసలువి కాకపోవచ్చు.
చాల సందర్భాలలో వాటిని స్థానికంగా తయారుచేసి
దిగుమతిచేసుకున్న డబ్బాలలో, సీసాలలో ప్యాక్ చేస్తారు.

డబ్బు దండుగ చేయవద్దు; మోసపోవద్దు

davp 80/36

భారతీయులుగా ఉందాం
భారతీయ సరుకులు కొందాం

డైరక్టరేట్ ఆఫ్ పబ్లికేషన్స్
కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సయిజ్
న్యూఢిల్లీ – 110 002

79/501


అంటే నల్లబల్లే. దానిమీదే మన రాతలు రాసి చెరిపివేస్తుంటారు. దానిమీన నీ ముద్ర!! హ్హి" మజ్జు పళ్ళు బయటకొచ్చాయి.

"ఏమిటి ముద్రంటున్నావ్?" రానా అడిగాడు.

"ఈ ప్రతిపాదనకు మీరు ఆమోద ముద్ర వెయ్యాలని మనవి" మజ్జు రాజకీయ వినయం వుట్టిపడేలా అన్నాడు.

"ఆహాఁ....అచ్చంగా మా భాషలోనే మాట్లాడేస్తున్నావే! పైకొస్తావ్. అదిసరే—వేలిముద్రకే పని కల్పించాలంటే కష్టపడి పేరు సంపాదించాలి. ఈ మాట ముందుగానే చెప్పా. ఏదీ మీ కష్టం...." చెయ్యి చాపాడు నగుమోముతో రానా! మజ్జు బిత్తరపోయాడు. అల్లావుద్దీన్ అయోమయ స్థితిలో పడ్డాడు. ఇద్దరు ముఖాల్ని మార్చిమార్చి చూసుకున్నారు.

"అయ్యా మీరన్న "కష్టం" వుందే దాన్ని అర్థం చేసుకోవడం బహుకష్టంగా వుంది సార్. కష్టం అంటే...." మజ్జు నసిగాడు.

"ఎట్లామరి! పెద్దవాళ్ళ దగ్గరకు వచ్చే ముందు వాళ్ళ భాష నేర్చుకోవాలి. కనీసం మా పరిభాషను అర్థం చేసుకునే మెలుకువన్నా వుండాలి. కష్టం అంటే అర్థం కాకపోతే చెప్పడం కష్టమే అవుతుంది. మన పార్టీ ఫండు కోసం....ఎంతో వొద్దు వెయ్యిచాలు—కష్టం అనమాక... చెయ్యర్మనంటే తెలికేం కాదు" రానా చెయ్యి అలాగే వుంది.

"బానాను బోర్డులు చాలా బరువుగా వుంటాయి. తేలిక మార్గం ఏదన్నా వుంటే చూపిద్దురూ—పుణ్యం వుంటుంది." మజ్జూ రెండు చేతులూ చాపి అన్నాడు.

"పుణ్యానిదేముంది? హుండీలో పదివేలు పడేస్తే అదే వొస్తుంది. పైగా పార్టీకి పాపం పుణ్యంతో పని వుండదు. పార్టీ గట్టిపడాలన్నదే ముఖ్యం. గట్టిపడాలంటే .... ఏదీ....కష్టం" రానాగారన్నారు.

అల్లావుద్దీన్‌కి రానాగారి వాలకం బాగా నచ్చింది. మజ్జు వారితో బేరం ఆడటం బాగా


## బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
## స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి

లోధ్ర

75 సంవత్సరములకు పైగా
సుఖజీవనమునకు
లోధ్ర టానిక్‌ను
వాడిన స్త్రీలు ఎందరో!

ఉచిత వైద్య సలహాకు
ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు
ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.

పేరు ________
విలాసము: ________
________ PIN ________



కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14
ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికింద్రాబాద్.

లేదనిపించింది. అందుకే కుర్చీ పక్కనుంచి చెయ్యి పోనిచ్చి మజ్జూని గిచ్చి—

"ఏదో ఒక విధంగా రానాసార్‌గారికి డబ్బివ్వు. ఇది నా ఆజ్ఞ" అని నెమ్మదిగా అన్నాడు. చివరి మాట రానాగారికి విని పించింది.

"ఏమిటి ఆజ్ఞ అంటున్నాడు మీ అల్లా వుద్దీన్?" ప్రశ్నించాడు.

"ఆజ్ఞ అనక ఇంకేమంటాడు సార్! ఇతను అసలు అల్లావుద్దీనే—" మజ్జు కళ్ళు పెద్దవి చేశాడు. కాని రానాగారికి అర్థం కాలేదు.

"అసలు అల్లావుద్దీన్, వడ్డీ అల్లావుద్దీన్ ఏమిటి? ఎవరీ అల్లావుద్దీన్?" ముఖం చిట్లిం చాడు.

"అయ్యో బాబోయ్! అల్లావుద్దీన్ తెలియదా సార్? "అల్లావుద్దీన్ అద్భుత దీపం" సినిమా చూళ్ళే? అందులోని అసలయిన అల్లావుద్దీన్ ఈ సారే సార్!" మజ్జు సగర్వంగా అన్నాడు.

"నిజమే! నాకు ఆ మాయదీపమే గుర్తుంది. నిజానికి ఆ సినిమాలో ఆ దీపమే బాగా నటిం చింది. దాన్ని తాకినప్పుడల్లా రాక్షస వెధవ వొకడు రావడం.... అడిగినవన్నీ తెచ్చి యివ్వడం....ఆహా అదండీ జీవితం అంటె.... ఆ రాకాసి...."

"సార్! రాకాసి మిత్రాన్ని తిట్టమాకండి. ఈ మజ్జే ఆ రాకాసి.'' అల్లావుద్దీన్ నవ్వాడు. మజ్జూకి కోపమొచ్చింది.

"చూస్తావా నా మహిమ — ఆంఫట్!!" మజ్జు అనేసరికి వందరూపాయల కట్టలు ఒకదాని మీద ఒకటి మజ్జు చెయ్యిమీద పేరుక పోయ్యాయి!! రానాగారు కళ్ళు నులుపుకుని, ఒకసారి ఎడమచెయ్యిని గిచ్చి చూసుకొని, నెమ్మదిగా సీటులోనుంచి లేచి, అమాంతం ఒక్క గెంతులో తలుపు దగ్గరకెళ్ళి, గడివేసి- చేతులు జోడించి—

"రాకాసి మహాశయా! నీ మహిమలు తెలుసు కోకుండా ఏవన్నా తప్పుడు మాటలంటే క్షమించండి. కొట్టండి. ఆ కట్టల్ని మాత్రం ప్రసాదించండి. షార్టీ, గీర్టీ ఏవీ అనకుండా ఫిక్సెడ్ డిపాజిట్లలో వేసి—వెయ్యిన్నూట పదహారు బుక్కులు కొని నీ నామకోటి రాసు కుంటూ ఈ జన్మని తరింపజేసుకుంటూ— అయ్యా—సార్—కట్టలు—" రానాగార్కి వినయం పుట్టిపడింది.

"అట్లాకాదు. మీరిందాకా ఏదో బోర్డు అన్నారుగానీ నేనొక బ్లాక్‌బోర్డు యిస్తా— సుద్దముక్క యిస్తా. మీ కెంత డబ్బు కావాలో బోర్డుమీద వేసి చూపించండి—ఆంఫట్—" మజ్జు అనేసరికి చేతిలో రూపాయల కట్టలు మాయమయ్యాయి. ఎదురుగా గోడకి అతు క్కుని నల్లబల్ల— సుద్దముక్కలు కనిపిం చాయి.

"ఊఁ రండిసార్. ఇంకా తలుపు దగ్గ రెందుకు-పోనీ మేం తలుపు దగ్గర వుంటాంలే. మీ కెంత కావాలో బోర్డుమీద వెయ్యండి—" మజ్జూలేచి తలుపు దగ్గరకెళ్ళాడు. అల్లావుద్దీన్ కూడా అక్కడికి చేరుకున్నాడు.

రానాగారు సుద్దముక్క తీసుకుని ఒకటి వేసి పక్కనే ఏడు సున్నాలు పెట్టాడు. ఆ సున్నాల్ని లెక్కబెట్టి—"ఛీ ఏడు మంచి నెంబరు కాదు" అని మళ్ళీ సున్నాలు పెట్టి "దీని మిద ఇన్‌కంటేక్స్ ఎంత పడుతుందో-" అని మళ్ళీ సున్నాలు పెట్టి "మరి....ధర్మ కార్యాలకో...." అని మళ్ళీ సున్నాలు పెట్టి "ముందు తరాల వాళ్ళకో" అని మళ్ళీ సున్నాలు పెడుతూవుంటే—మజ్జూ అల్లావుద్దీన్ తలుపు తెరుచుకుని మెల్లగా జారుకున్నారు. పాపం.... రానాగారు కళ్ళు మూసుకుని కలలు కంటూ సున్నాలు పెడుతూనే వున్నారు.

(ఇంకా వున్నారు!)








**27** **సీరియల్**

సుధీర్ కోర్టునుంచి వచ్చాడు. అతను కాలింగ్ బెల్ నొక్కగానే స్వప్న చేస్తున్న పని వదిలి పరుగెత్తుకు వచ్చింది. లోపలకి రాగానే, కోటు స్టాండుమీద పడేసి, అతను స్వప్నని దగ్గరకి లాక్కున్నాడు. పని చేస్తోంది కాబోలు! స్వప్న ముఖంమీద చిరుచెమటలు అలుముకున్నాయి! ఆ కళ్ళు ఎందుకో మెరుస్తున్నాయి. ఒక్క నిముషం స్వప్నని చూసిన అతను అమాంతం చేతులతో ఎత్తి పడకగదిలోకి తీసుకువచ్చాడు. స్వప్న కెవ్వుమంది. అతన్ని వదిలించుకోవాలని చూసింది. కానీ సాధ్యంగాలేదు.

"ఏమిటి? దేవిగారు ఈ రోజు అంత సంతోషంగా వున్నారు!" అన్నాడు.

"చాలా సంతోషంగా వున్నాం. నిజమే! కానీ ఎలా తెలిసిందబ్బా!" స్వప్న ఆశ్చర్యపోయింది.

"మిలమిలలాడే కళ్ళు సాక్ష్యం చెబుతున్నాయోయ్! పెదవుల మీద నాట్యం చేసే ఆనందం, నాకు వార్త అందించేసింది."

"ఊహూ!" కళ్ళు పెద్దవిచేసి చూస్తూ అంది ఆ కళ్ళలో ఎంతయినా లాయరువి కదా అనే భావన వుంది."

"ఏమిటో చెప్పు!" అన్నాడు.

"ముందు కాళ్ళు చేతులూ కడుక్కోవాలి. తర్వాత టిఫిన్ తినాలి. అప్పుడు వార్త వినిపిస్తాం?"

"ఊఁ! అంతదాకా ఆగలేనోయ్. సస్పెన్స్ భరించలేను."

## జ్యోతి కథల పోటీ

## మొత్తం పదమూడు బహుమతులు

ప్రథమ బహుమతి : రు. **750**

ద్వితీయ బహుమతి: రు. **400**


తృతీయ బహుమతి: రు. **300**

ఇంకా....ప్రశంసార్హమైన మరో పది కథలకు ఒక్కొక్క దానికి రూ. **116** చొప్పున ప్రత్యేక బహుమతులు

### నిబంధనలు గమనించండి!

1. కథలు 16 పేజీలు మించకుండా (ముద్రణలో) ఉండాలి. (సుమారు పేజీకి 30 లైన్లతో 16 పేజీల ఫుల్‌స్కేపు పేజీలు మించకుండా.)
2. అనువాదాలూ, అనుసరణలూ అంగీకరింపబడవు. రచనలు తమ స్వంతమే ననే హామీ పత్రాన్ని విధిగా పంపాలి.
3. ముఖ్యగమనిక : రచయితలు తమ చిరునామాను కథవున్న పేజీలలోగానీ, ఆ పేజీల వెనుకగానీ కాకుండా, మరో కాగితంపై వ్రాసి జతచేయాలి.
4. రచయితలు కలం పేరుతోబాటు తమ అసలు పేరును విధిగా తెలియచేయాలి.
5. ప్రచురణార్హంగాని కథలు తిప్పి పంపగోరువారు కథలతోపాటు తగినన్ని తపాలా బిళ్ళలంటించిన స్వంత చిరునామాగల కవరు జతచేసి పంపాలి.
6. పోటీకి రచనలు పంపే కవర్లపై 'జ్యోతి కథలపోటీకి' అని విధిగా రాయాలి.
7. పోటీలో బహుమతి పొందని కథలలో ప్రచురణార్హమైనవాటిని ప్రచురణకు స్వీకరించే హక్కు మాకుంటుంది.
8. పోటీ విషయంగా జ్యోతి సంపాదకులదే తుది నిర్ణయం. —ఎడిటర్

రచనలు పంపేందుకు ఆఖరు తేదీ
**31 ఆగస్టు 1980**




"ఆహా! ఎంత శీతలముగా నున్నదీ రమణీయ ప్రదేశము! రంగులు మార్చుకొనుచున్న గిరులు; అడ్డముగ నిలువుగ అడ్డదిడ్డముగ ఎదిగిన తరులు! కొండల తలమీద కుచ్చుల టోపీలా ఊగుతున్న మేఘాలు! ఆహా! ఒడలు మైమరిపించే మనోహర దృశ్యము!! ఏమి ఈ పులకింత ఔరా....హౌరా!!"

మజ్జూ గంతు లేసుకుంటూ అంత దారుణంగా ఆశ్చర్య పోతూవుంటే అల్లావుద్దీన్‌కి అంత చల్లటి ప్రదేశంలోనూ ఒళ్ళు మండిపోయింది. ఆపు మజ్జూ అని గట్టిగా అరిచాడు. మజ్జు తక్కున ఆపుజేసి అల్లావుద్దీన్‌కేసి చూస్తూ—

మాట్లాడలేవా?" అన్నాడు అల్లావుద్దీన్.

"నో. నై. చేతకాదు. ఈ వింత ప్రాంతంబునందు పాదంచిడిన తర్వాత మామూలు భాషయా మాట్లాడుట. కల్ల కల్ల అల్లావుద్దీన్‌సాబ్—"

అల్లావుద్దీన్‌కి పాలుపోక అరవైవోల్టుల బల్బు తీసి గట్టిగా నొక్కాడు. దాంతో మజ్జు కీచుమని అరిచి చేతులు కట్టుకుని అతనిముందు సవినయంగా నిలువబడ్డాడు.

"తగ్గిందా నీ మత్తు. ఇప్పుడు చెప్పు ఈ ప్రాంతం పేరేవిటి?" అల్లావుద్దీన్ అడిగాడు.

"అయ్యా— ఈ ప్రాంతాన్ని— అరకులోయ అంటారు."

"అట్లాగా అయితే ఈ దేశం పేరేమిటి?"

## అరకులోయలో అల్లావుద్దీన్!

"సార్....,ఇంత చల్లటి చోట తమనోట ఆ మాట రాతగునా! ఏల కళ్ళు ఎర్రబడ, పెదవులు తడబడ, కంఠంబు వణక ఏలఏల?" అంటూ వుంటే

"మజ్జూ—ఆపు," అంటూ ఓ చిన్నపాటి గావు కేక పెట్టి "ఏమయింది నీకు. ఏవిటా మాటలు భయంవేస్తుంటేనూ? మామూలుగా

అల్లావుద్దీన్ ప్రశ్నించాడు.

"ఏంటిసార్, అలా అరిగారు? ఇది భరత ఖండంలోని ఆంధ్రదేశంలోనే వుంది. జాగ్రఫిలో తమరికి పెద్దసున్నా—" మజ్జు చివరి మాటలు గొణిగాడు.

"ఏంటి—జిరాఫీకి సున్నమా!" అర్థంకాక అడిగాడు అల్లావుద్దీన్.

"ఆహా....ఏం సెలవిచ్చారు సార్! నేను అన్నది జాగ్రఫీ — అంటే భూగోళశాస్త్రం. అంతేసార్. పూర్వం జాగ్రఫీ అని కొంత భూగోళశాస్త్రం చెప్పేవాళ్ళు. అప్పుడు-కనీసం, ఇలాంటి ప్రాంతాల పేరులయినా తెలిసివుండేవి ఇప్పుడు అన్నీ జిరాఫీ వ్యవహారాలే అవడం వల్ల ఇలాంటి లోయలు కనిపించడం లేదు. అసలు—ఎల్లలే గుర్తుండకుండా పోతున్నాయి సార్! శ్రీకాకుళం మనదో కాదో, అదిలాబాద్, తిరుపతి మనవో కావో తెలియకుండా పోతున్నాయి సార్....అందుకే—"

"అవు. మనవి మనవి అంటున్నావ్ ఏంటి కథ! ఇందులో మనవేమున్నాయి మజ్జూ? హుఁ. మనం ఎక్కణ్నుంచి వచ్చామో ... ఎక్కడికి వెళ్తామో ఎవరికి తెలుసు?"

"ఇదీ కరెక్టే! ఈ దేశంలోవున్న వాళ్ళంతా ఇలాగే అనుకుంటారు సార్—ఎక్కణ్నుంచి వచ్చామో ఎక్కడికి పోతామో. దీన్ని తత్వం అంటారు. ఈ దేశంలో వున్న వాళ్ళంతా తాత్వికులే. వాళ్ళకు ఈ లోకంతో పనిలేదు. అంతా పై లోకమే! ఇక వాళ్ళకి లోయలేం కనిపిస్తాయ్ సార్!"

ఇంతలో మరింత ఎత్తుగావున్న మరోకొండ వచ్చింది. ఆ కొండమీద కొచ్చింతర్వాత వాళ్ళ దుస్తులు మంచుకి తడిసిపొయ్యాయి! అల్లావుద్దీన్ చలికి గడగడ వణుకుతూ—"మహజ్జు ఎహేవిటి....ఇంత చహిలిగా హుంది?" అన్నాడు.

"వుంటుంది సార్. ప్రస్తుతం మనం అరకు లోయలో అన్నిటికన్నా ఎత్తయిన కొండమీద వున్నాం. దీనిపేరు అనంతగిరి. చలి కాస్త ఎక్కువగానే వుంటుంది. మీరు మరీ పళ్ళు బిగించి మాట్లాడమాకండి. మాటలు అర్థం కావడంలేదు సరికదా మీ నోటి నుంచి పిండి గిర్నీ మోత వినిపిస్తోంది!" మజ్జు అన్నాడు. అల్లావుద్దీన్ నొచ్చుకున్నా అది కనబడనీయకుండా కాసేపు అటూయిటూ చూసి—

"మజ్జూ, చెట్లకు కట్టిన ఆ పచ్చబస్తాలేవిటి?" విస్తుబోతూ చెట్లకేసి చూపిస్తూ అడిగాడు. మజ్జూ చూశాడు.

"సార్—పచ్చగా వున్న మాట వాస్తవమే గాని అవి బస్తాలు కావు. పనసకాయలు. వాటిని పనసకాయలు అంటారు. ఇలాంటివే తమరికి తెలియని కాయలు, చెట్లూ వందల కొద్ది వున్నాయి. ఇంకొక రహస్యం చెప్పనా? సకల రోగాలకు 'పనికొచ్చే' వనమూలికలు బోలెడన్ని వున్నాయి. వాటిసంగతి యెవరూ పట్టించుకోవడం లేదు."

"పోన్లే మజ్జూ. ఎవరికీ పట్టనప్పుడు మనకెందుకు?" అల్లావుద్దీన్ చాలా తాపీగా అన్నాడు. కాని మజ్జు ఊర్కోలేదు.

"అబ్బే అలా అంటే యెలా? అందరూ అలాగే అనుకుంటే ఇక దేశం బాగుపడ్డట్టే. నాకే కాస్త అధికారముంటే—సర్వరోగ నివారిణి సంజీవినిలాంటి మందులు కనిపెట్టే ప్రయోగశాలలు కట్టించి పారేసేవాణ్ణి తెలుసా?" మజ్జు ఆవేశంగా అన్నాడు.

"దీనికి దీర్ఘం తియ్యడం దేనికి—హాం ఫట్ మని అదేదో శాల పెట్టరాదా?"

"అమ్మమ్మా—అంతపని చెయ్యకూడదు, ఈదేశం వాళ్ళ సంగతి నీకు తెలియదు సార్. సోమరితనం వీళ్ళ తోబుట్టువు. మనం హాం ఫట్ అని ప్రయోగశాల సృష్టిస్తే — కాలొద్దు గోలొద్దు అసలు రోగాలు రాకుండానే హాంఫట్ అనమంటారు! వద్దుసార్....ఇప్పటికే చాలా 'షార్టుకట్టు'లయ్యాయి" మజ్జు సర్దుకున్నాడు.

ఇంకాస్త దూరం నడిచారు. మరో చిన్న లోయ వచ్చింది. చుట్టూ తోటలు కనిపించాయి. పువ్వులూ, పండ్లూ, రంగుల మొక్కలూ—ప్రకృతికి అందం తెచ్చిపెట్టేవన్నీ వున్నాయక్కడ. అవన్నీ చూస్తూనే అల్లావుద్దీన్ పరవశించిపోయాడు.

"మజ్జూ మిత్రమా! ఒడలు ఏమిటి వశము తప్పుచుండె?"

"పైత్యం సార్—" మెల్లగా అన్నాడు మజ్జు.

"ముగ్ధమనోహరంబులయిన పుష్పములను గాంచితివా? నోరూరించు ఫలములను దిలకించితివా?"





"ఏయ్ మజ్జూ — చెక్కడు చెక్కడుగా, ముళ్ళు ముళ్ళుగావున్న ఆ కాయ పేరేమిటి?"

"దీన్ని పైనాపిల్ అంటారు. పైకి అలా కనిపించినా రుచిమట్టుకు యమాగా వుంటుంది! ఉండండి" మజ్జు గబాలున ఒక కాయను కోసి, శుభ్రంగా చెక్కి, గుండ్రంగా ముక్కలుకోసి అల్లావుద్దీన్‌కి పెట్టాడు. వాటిని తింటూ తోటలన్నీ తిరుగుతూ వేరే వనంలో అడుగుపెట్టారు. ఒకచెట్టు దగ్గరకొచ్చేసరికి నాలుగు రకాలయిన వాసనలు గుబాళించాయి. ముక్కు పుటాల్ని పెంచి బాగా వాసనల్ని పీల్చితే మసాలా వాసనలు తగిలాయి. మజ్జూ, అల్లావుద్దీన్ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. మజ్జూ యెగిరి ఒకాకును తెంపి, నలిపి వాసనచూసి, చెట్టుకేసి చూసి—సార్—అని అరిచాడు. అల్లావుద్దీన్ అదిరిపోయి మజ్జువంక చూశాడు—ఏవిఁటి—అన్నట్టు.

"సార్. ఇది ఓ అపురూపమైన చెట్టు. చూశారా....ఈ ఒక్కచెట్టుకే లవంగాలూ, ఏలకలూ, జాజికాయలూ కాస్తున్నాయి! ఈబెరడు చూడండి; ఇదిదాల్చిన చెక్క. అంటే మసాలా దినుసులన్నీ ఒకే చెట్టుకు కాస్తున్నాయన్న మాట!"

"నిజమే మజ్జూ. చాలా విచిత్రంగా వుంది! ఈ చెట్టు పేరేమిటి?"

"సర్వసుగంధిని—అని మనం పిల్చుకోవచ్చు. ఇది కాశ్మీర్ అడవుల్లో, అయిదువేల అడుగుల పైనున్న కొండలోయల్లో దొరుకుతుంది. అరకులోయలో యిలాంటి చెట్టు వుండటం నిజానికి మన అదృష్టం! కనీసం కళ్ళతోనయినా ఇలాంటి అద్భుతమైన చెట్టును చూసే అవకాశం దొరికింది...." మజ్జూ అన్నాడు. అల్లావుద్దీన్ క్షణంసేపు ఆలోచించి-

"మజ్జూ—ఈ చెట్టు మొక్కల్ని కొన్ని పట్టుకెళ్ళి మన పార్కుల్లోనూ, పబ్లిక్‌గార్డెన్లలోనూ వేస్తే పదిమందీ చూస్తారుగా?"—అన్నాడు.

"సార్, పార్కుల్లో ఇప్పుడు వున్న చెట్లకు నీళ్ళుపోస్తే చాలు సార్. ఇలాంటి మొక్కలను తీసుకెళ్ళి చంపడం దేనికి? ఇంతెందుకు? ఇక్కడే ఓ పెద్దతోట వేయించి ఈ చెట్లను పెంచవచ్చుగా? మసాలా దినుసులకున్న గిరాకీ తెలియందేముంది చెప్పండి? ఏమిటో సార్... వనమహోత్సవాలు ఎక్కువయ్యే కొద్ది చెట్లు సరిగ్గా మొలవడంలేదు! ఇంతకుముందు ప్రతి యింట్లోనూ కూరగాయల పాదులు వుండేవి. టమాటా, చిక్కుడు, వంగ, బెండ, కాకర, బీర—అన్నీ యిండ్లలోనే పండేవి. అప్పట్లో ఇండ్లు యెంత అందంగా వుండేవని—పచ్చగా నిండుగా! ఇప్పుడో కరేపాకు కట్టకోసం రిక్షా వేసుకొని మార్కెట్ వరకూ పరుగులెత్తాలి." అల్లావుద్దీన్ గట్టిగా నవ్వాడు. మజ్జు పళ్ళు కూడా బయటకొచ్చాయి.

"ఏవిటో మజ్జూ—మనకున్న సంపదేవిటో తెలుసుకోకుండానే ఉత్తుత్తి మాటలతోనే కాలాన్ని గడిపేస్తున్నాం. ఇలాంటి విచిత్రమయిన చెట్లూ, అద్భుతమైన వనాలు యింకా ఎన్ని వున్నాయో!" అల్లావుద్దీన్ కాస్త దిగులుగా అన్నాడు.

"సార్....ఇక్కడున్న మనుషుల్ని మీరు యింకా చూడలేదు! ఇప్పటిప్పుడే బట్టకట్టడం నేరుస్తున్నారుగాని — మొన్నటిదాకా మొల చుట్టూ ఓ గుడ్డపీలిక—మిగతా అంతా...." మజ్జుకు సిగ్గు ముంచుకొచ్చింది. అల్లావుద్దీన్ బుగ్గలు కూడా యెరుపెక్కాయి.

"అబ్బా—అంత అనాగరికులా?" అల్లావుద్దీన్ దీర్ఘం తీశాడు.

"ఆ మాటంటే నే ఊర్కోను. గుడ్డలు లేకపోయినా మానం వుంది; మర్యాద వుంది. నీతి నిజాయితీలు, నమ్మకం, భయభక్తులూ వున్నాయి. ఇంకేం కావాలి? నాగరికత అంటే ఏవిటి? ఎదుటి వాణ్ని ఎలా దోచుకోవాలా అనే తెలివేనా నాగరికత అంటే? వీళ్ళు అడవిలో వున్నమాట నిజమే. కాని మన అడవులమాటేవిటి? సిమెంటు భవనాల కారడవులు కావా మన సిటీలు? పగ, ద్వేషం, అసూయ అనుమానం, దోపిడి తప్ప మరేమీ తెలియని మనం నాగరికులమా? ఏది నాగరికత? ఏది అనాగరికత? ఏది సత్యం? ఏది అసత్యం? ఓ మహాత్మా!" అంటూ అల్లావుద్దీన్ని భుజాలమీద యెక్కించుకుని హాంఫట్ అన్నాడు మజ్జు. ఇద్దరూ మాయమైపోయారు. □